మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

బుధవారం 11-03-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 142

విలేకరులు కావలెను





తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District

## పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధం

అమెరికాతో చర్చల ప్రసక్తే లేదన్న ఇరాన్



- ఆస్తులు, ఆయుధ నిల్వపై వైమానిక దాడులు
- లెబనాన్‌లో పలువురిని హతమార్చిన ఐడీఎఫ్
- బాలిస్టిక్ క్షిపణిని కుల్చేసిన సౌదీ అరేబియా
- ఇరాన్ ప్రజల చేతుల్లోనే రాజకీయ భవిష్యత్తు
- ఇరాన్ విముక్తి ఆ దేశ ప్రజల చేతుల్లోనే ఉంది
- ఇరాన్ లో నిరంకుశ పాలన రాజ్యమేలుతుంది
- ఇరాన్ పై ఇంకా మా యుద్ధం కొనసాగుతుంది
- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వ్యాఖ్యలు

### లెబనాన్‌పై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

**లెబనాన్, మార్చి 10 డ్రీమ్ టైమ్స్**

పశ్చిమాసియాలో యుద్ధం అంతకంతకూ తీవ్రమవుతోంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్‌కు చెందిన ఐడీఎఫ్ విరుచుకుపడింది. లెబనాన్‌లోని హెజ్‌బొల్లాకు చెందిన అల్ క్వార్డ్ అల్ హసన్ అసోసియేషన్ ఆస్తులు, ఆయుధ నిల్వ సౌకర్యాలపై వైమానిక దాడులు చేపట్టింది. హెజ్‌బొల్లా సైనిక సామర్థ్యాలను మరింత దెబ్బతియడానికి ఈ దాడులను ఐడీఎఫ్ చేసింది. ఈ మేరకు ఐడీఎఫ్ ఎక్స్ పోస్టులో పేర్కొంది.అలాగే లెబనాన్ రాజధాని బీరూట్‌లో కచ్చితమైన దాడులు జరిపినట్లు మరో ఎక్స్ పోస్టులో ఐడీఎఫ్ పేర్కొంది. ఈ దాడుల్లో లెబనాన్ కార్ప్స్‌లోని ఐదుగురు సీనియర్ కమాండర్లను హతమార్చినట్లు తెలిపింది. "లెబనాన్ కార్ప్స్ కమాండర్ దావూద్ అలీ జాదే, లెబనాన్‌లోని ఇరాన్ కుద్‌ఫోర్స్ శాఖలకు నిధులను బదిలీ చేసే మాజిద్ హసిని, లెబనాన్ కార్ప్స్ ఇంటెలిజెన్స్ సెక్టార్ కమాండర్ అలీ రెజా అజార్, లెబనాన్ కార్ప్స్‌లో ఇంటెలిజెన్స్ ఆపరేటివ్ హసన్ అహ్మద్‌ను

-మిగతా 3 లో





## బెంగాల్లో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ

- ఈసీ ఆదేవాల మేరకే ఉద్యోగులు పనిచేయాలి
- అర్హులైన ఏ ఒక్కరి పేరూ తొలగించలేదు
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్

**కోల్‌కతా మార్చి 10 డ్రీమ్ టైమ్స్**

ఓటర్ల జాబితా నుంచి అర్హులైన ఏ ఒక్క ఓటరును తొలగించేది లేదని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో స్వేచ్ఛగా, సజావుగా, ప్రశాంతంగా ఎన్నికలు జరపడానికే ఎన్నికల సంఘం మొదటి ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. ఎన్నికల పక్రియలో ప్రభుత్వ ఉద్యోగులందరూ ఈసీ ఆదేశాల మేరకు పనిచేయాల్సి ఉంటుందని, ఎలాంటి లోటుపాట్లను సహించేది లేదని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీలు, అధికారులతో వరుస సమావేశాల అనంతరం మీడియాతో సీఈసీ మంగళవారంనాడు మాట్లాడారు.పశ్చిమబెంగాల్‌లో 80,000 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, వీటిలో 61,000 బూత్‌లు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయని సీఈసీ చెప్పారు. ఓటింగ్ పక్రియలో పారదర్శకత, అవకతవకల నిరోధానికి అన్ని పోలింగ్ బూత్‌లలో వెబ్‌కాస్టింగ్ పక్రియ అమలు చేస్తామని తెలిపారు. రాజ్యంగం ప్రకారమే ఎస్ఐఆర్ పక్రియ నిర్వహించామని, పూర్తిగా పారదర్శకతంగా జరిగిందని తెలిపారు. ఢిల్లీ వెళ్లిన తర్వాత ఎన్నికల కమిషన్ సమీక్షా సమావేశం జరుపుతుందని చెప్పారు. పశ్చిమబెంగాల్‌లో హింస మరియు బెదిరింపులకు తావు లేకుండా ఎన్నికలు జరిగేలా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణపై ఇసి రెండు రోజుల

-మిగతా 3 లో

## దేశంలో గ్యాస్ కొరత

ముంబైలో 20 శాతం హోటళ్లు, రెస్టారెంట్‌లు మూత

- యుద్ధంతో చమురు, గ్యాస్ కొరత
- వాణిజ్య సిలిండర్ సరఫరాకు అంతరాయం
- దేశవ్యాప్తంగా ఆగిపోయిన గ్యాస్ సరఫరా..
- ఢిల్లీ, ముంబై, బెంగళూరులో మరింత తీవ్రతరం
- తెలంగాణలోను బంద్ దిశగా హోటళ్లు
- సంక్షోభంలో మూతపడుతున్న హోటల్ ఇండస్ట్రీ

**న్యూఢిల్లీ, మార్చి 10 డ్రీమ్ టైమ్స్**

ఇరాన్-అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధ పరిణామాలను ప్రస్తుతం ప్రపంచం మొత్తం అనుభవిస్తోంది. దీని విస్తృత ప్రభావం ఇప్పటికే చాలా చోట్ల కనిపిస్తోంది. భారత్‌లో పెట్రోలియం, గ్యాస్ పరిస్థితి బాగానే ఉందని ప్రభుత్వం చెబుతోంది, కానీ వాణిజ్య సిలిండర్ల అందుబాటులో లేకపోవడం , గృహ సిలిండర్లపై తప్పనిసరి 25 రోజుల వారంటీ కారణంగా ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. దీనిని సైడ్ ఎఫెక్ట్ లేదా పుకారు అని పిలిచినా, గ్యాస్ సిలిండర్ గిడ్డంగుల వెలుపల ఇప్పుడు ప్రజల పొడవైన క్యూలు కనిపిస్తున్నాయి.

-మిగతా 3 లో






## ఎన్నిసార్లు చెప్పాలి?

- 40 మంది ఎమ్మెల్యేలను పిలిచి హెచ్చరించా
- 15 మంది దారికొచ్చారు.. మిగిలిన వారు మారలేదు
- త్వరలో నలుగురైదుగురిపై వేటు తప్పదు
- స్థానిక సంస్థల ఎన్నికల్లోపే కఠిన నిర్ణయాలు
- మంత్రులతో ప్రత్యేక భేటీలో సీఎం స్పష్టీకరణ!

**అమరావతి, మార్చి 10 డ్రీమ్ టైమ్స్**

కొంతమంది ఎమ్మెల్యేల వ్యవహార శైలి మారాల్సి ఉన్నదని, వారికి త్వరలోనే తుది హెచ్చరిక చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సచివాలయంలో మంగళవారం సీఆర్డీయే సమావేశం అనంతరం మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, పయ్యావుల కేశవ్‌తో సీఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. తాజా రాజకీయ పరిణామాలతోపాటు పార్టీ క్యాడర్‌లో నెలకొన్న అసంతృప్తిని తొలగించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆరు నెలల క్రితం రాష్ట్రంలో 40 మంది ఎమ్మెల్యేల పనితీరుపై తాను అసంతృప్తితో ఉన్నానని,

-మిగతా 3 లో



## లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లపై అవిశ్వాసం

- జగదంబికా పాల్ ప్రత్యేక స్పీకర్‌గా విధులు
- చర్చను ప్రారంభించిన కాంగ్రెస్ ఎంపి జావెద్
- విపక్ష నేతను అవమానిస్తూ మాట్లాడేందుకు నిరాకరించారని ఆరోపణ
- కాంగ్రెస్ సంప్రదాయాలు పాటించడం లేదన్న కిరణ్ రిజిజు
- నెహ్రూను తిట్టేవారు ఆయనను జపిస్తున్నారంటూ ప్రియాంక ఎదురుదాడి

**న్యూఢిల్లీ మార్చి 10 డ్రీమ్ టైమ్స్**

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం గురించి లోక్‌సభలో చర్చ ప్రారంభమైంది. ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావెద్ లోక్‌సభలో మంగళవారం ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై చర్చ ప్రారంభమైంది. ఈ చర్చ కోసం పది గంటల సమయం కేటాయించారు. అనంతరం తీర్మానంపై ఓటింగ్ నిర్వహించనున్నారు. స్పీకర్ ఓం బిర్లా నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని, ఆయన అధికార పార్టీ భాష మాట్లాడుతున్నారని తీర్మానాన్ని ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావెద్ ఆరోపించారు. అనంతరం అవిశ్వాస తీర్మానంపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చర్చను ప్రారంభించారు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం గురించి చర్చ జరుగుతున్న సమయంలో సభను నడిపేందుకు ప్రత్యేక సభాపతిని నియమించాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ డిమాండ్‌కు కేంద్రం అంగీకరించింది. సీనియర్ ఎంపీ,

-మిగతా 3 లో

## తెలుగు వైభవాన్ని చాటేలా అమరావతి

- సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- క్రీడలు, పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి
- సీఆర్‌డీఏ సమావేశంలో సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం

**అమరావతి, మార్చి 10 డ్రీమ్ టైమ్స్**

తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటిచెబుతూ.. భావితరాలకు అందించేలా అమరావతి రాజధానిని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం అధ్యక్షతన 59వ సీఆర్‌డీఏ సమావేశం జరిగింది. రాజధానిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులు, సెక్రటేరియట్, హెచ్‌వోడీ భవనాల్లో మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించారు.

-మిగతా 3 లో





## త్వరలోనే ఇరాన్ యుద్ధం ముగింపు

- పుతిన్‌తో గంటసేపు ఫోన్లో మాట్లాడిన ట్రంప్
- కీలక అంశాలపై చర్చించిన ట్రంప్, పుతిన్
- ఇరాన్ పూర్తిగా ఓడిపోయే వరకు కొనసాగుతోంది
- యుద్ధం ముగింపుపై ట్రంప్ విరుద్ధ ప్రకటన
- అమెరికా అన్నివిధాలా గెలించిందని వెల్లడి
- ఇరాన్ పెద్ద తప్పు చేసిందని ట్రంప్ వ్యాఖ్యలు

**వాషింగ్టన్, మార్చి 10 డ్రీమ్ టైమ్స్**

పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడారు. వారిద్దరూ దాదాపు గంటసేపు ఫోన్‌లో కీలక అంశాలపై చర్చించారు. అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని త్వరగా ముగించేందుకు పుతిన్ కొన్ని ప్రతిపాదనలు చేసినట్లు క్రెమ్లిన్ వెల్లడించింది. వాషింగ్టన్ చొరవతో జరిగిన ఈ చర్చల్లో యుద్ధాన్ని దౌత్యమార్గాల ద్వారా

-మిగతా 3 లో

## నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలి

వక్ఫ్ ఆస్తులను సద్వినియోగం చేసుకోవాలి

- న్యాయశాఖ మరియు మైనారిటీ వెల్ఫేర్ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్
- అన్ని వర్గాల వారిని అభివృద్ధిలోకి తీసుకొని వస్తున్నాం...
- పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్

6



డ్రీమ్ టైమ్స్
తెలుగు దిన పత్రిక
DREAM TIMES DAILY NEWS PAPER
బుధవారం
11-03-2026


# అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరును జాబితా నుంచి తొలగించం

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్



**న్యూఢిల్లీ మార్చి 10 డ్రీమ్ టైమ్స్**
అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరును కూడా ఓటర్ జాబితా నుంచి తొలగించబోమని కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నిమిత్తం సీఈసీ బృందం పశ్చిమబెంగాల్‌లో పర్యటించింది. ఈ క్రమంలో రాజకీయ పార్టీలు, అధికారులతో సమావేశాల అనంతరం జ్ఞానేశ్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. పశ్చిమబెంగాల్‌లో స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడటమే ఎన్నికల సంఘం మొదటి ప్రాధాన్యమని ఆయన చెప్పారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును ఉపయోగించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా అర్హత కలిగిన ఓటర్ల పేర్లు ఎప్పటికీ తొలగించబోమని స్పష్టంచేశారు. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారమే అన్ని రాష్ట్రాల్లో 'ప్రత్యేక సమగ్ర సవరణఅమలవుతుందని అన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడటం, అర్హులైన వారి పేర్లు ఆ జాబితాలో ఉండేలా చూడటమే 'సర్' బాధ్యత అని చెప్పారు. ఇక్కడ ఎన్నికలు ఎన్ని దశల్లో జరుగుతాయనేది రాష్ట్రప్రభుత్వం శాంతిభద్రతల విషయంలో చేపట్టే చర్యలపైన ఆధారపడి ఉంటుందన్నారు. బెంగాల్ ఎన్నికల ప్రక్రియలో ప్రభుత్వ ఉద్యోగులందరూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విధులు నిర్వర్తించాలని చెప్పారు. ఓటర్లపైనా, ఎన్నికల అధికారులపైనా రాజకీయ నేతలు ఎలాంటి బెదిరింపులకు పాల్పడినా సహించేది లేదని అన్నారు. పశ్చిమబెంగాల్‌లో దాదాపు 80 వేల పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, వాటిల్లో దాదాపు 61 వేలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయని చెప్పారు. ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకతను పెంపొందించేందుకు రాష్ట్రంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో ఎలాంటి అవకతవకలు జరగకుండా వెబ్‌కాస్టింగ్ ప్రక్రియను అమలుచేయనున్నట్లు తెలిపారు.

# ఇరాన్ సంక్షోభంలోనూ బంగ్లాదేశ్‌కు భారత్ సాయం..

## -5,000 టన్నుల డీజిల్ సరఫరా



**న్యూఢిల్లీ మార్చి 10 డ్రీమ్ టైమ్స్**
ఇండియా-బంగ్లాదేశ్ మధ్య కొంతకాలం క్రితం విబేధాలు తలెత్తిన సంగతి తెలిసిందే. అయితే, ఇటీవలి కాలంలో ఈ పరిణామాలు కాస్త మారుతున్నట్లు కనిపిస్తున్నాయి. బంగ్లాదేశ్ అవసరం ఇండియాకు పెద్దగా లేకపోయినా.. ఇండియా అవసరం బంగ్లాకు ఉంది. అదే సమయంలో ఇండియా కూడా బంగ్లాదేశ్ అంశంలో సానుకూలంగానే స్పందిస్తోంది. తాజాగా బంగ్లాదేశ్‌కు ఇండియా 5,000 టన్నుల డీజిల్ సరఫరా చేసేందుకు సిద్ధమైంది. అది కూడా ఒక పక్క ఇరాన్ వార్ జరుగుతుండగా సరఫరా చేయడం విశేషం. గతంలో ఇండియా-బంగ్లాదేశ్ మధ్య చమురు సరఫరాపై ఒప్పందం కుదిరింది. దీనిలో భాగంగా ఇరు దేశాల మధ్య ఫ్రెండ్‌షిప్ పైప్‌లైన్ కూడా నిర్మించారు. అంతకుముందు చమురు సరఫరా రైల్వే ట్యాంకర్ల ద్వారా జరిగేది. బంగ్లాతో ఒప్పందం ప్రకారం ప్రతి ఏడాది బంగ్లాకు 1,80,000 టన్నుల డీజిల్‌ను ఇండియా సరఫరా చేయాలి. ఐదేళ్లపాటు ఈ ఒప్పందం అమలులో ఉంటుంది. దీనిలో భాగంగా తొలి విడతగా 5,000 టన్నుల డీజిల్‌ను ఇండియా బంగ్లాకు సరఫరా చేసింది. మంగళవారం నాటికి ఈ డీజిల్ బంగ్లాకు చేరుకుంటుందని అంచనా. అలాగే వచ్చే ఆరు నెలల్లో 90,000 టన్నుల డీజిల్ సరఫరా అవుతుందని భావిస్తున్నట్లు బంగ్లాదేశ్ పెట్రోలియం కార్పొరేషన్ ఛైర్మన్ ముహమ్మద్ రెజనూర్ రెహమాన్ అన్నారు. ఇది తమ దేశీయ అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నిజానికి ఇండియా ఎప్పటినుంచో బంగ్లాకు చమురు సరఫరా చేస్తోంది. అలాగే, ఇక్కడి నుంచి విద్యుత్‌ను కూడా బంగ్లాక అందించేది. కానీ, రెండేళ్లక్రితం అక్కడ షేక్ హసీనా ప్రభుత్వం పడిపోయాక పరిస్తితులు మారిపోయాయి. అక్కడ హిందువులపై దాడులు పెరిగిపోయాయి. ఇదే సమయంలో ఇంతకాలం బంగ్లాను నడిపించిన యూనస్ ప్రభుత్వం ఇండియాకు వ్యతిరేకంగా వ్యవహరించింది. ఇండియానుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేసింది. అలాగే అదానీ సంస్థకు చెందిన ఝూర్ఖండ్ పవర్ ప్లాంట్ నుంచి విద్యుత్ తీసుకోవడాన్ని తగ్గించింది. కానీ, ఇప్పుడు బంగ్లాలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో మళ్లీ పాత పద్ధతుల్లోనే ఇండియా-బంగ్లాదేశ్ మధ్య చమురు సరఫరా మొదలైంది.

# మొజ్తాబా ఖమేని ఎక్కడ..?


## -ఇజ్రాయెల్ దాడిలో గాయపడ్డారా..?
## -ఇరాన్ మీడియా హింట్



**న్యూఢిల్లీ- మార్చి 10 డ్రీమ్ టైమ్స్**
ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా మొజ్తాబా ఖమేనిని ఆ దేశ అసెంబ్లీ ఎన్నుకున్న సంగతి తెలిసిందే. అయితే, సుప్రీం లీడర్‌గా ఎన్నికైన తర్వాత కూడా మొజ్తాబా ఖమేని ఎక్కడా కనిపించడం లేదు. ప్రజల ముందుకు రాలేదు. బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు. దీంతో ఆయన ఎక్కడ ఉన్నారు, ఏం చేస్తున్నారు అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌కు చెందిన ఒక అధికారిక టీవీ ఛానెల్ చేసిన ప్రకటన ఇప్పుడు సంచలనంగా మారింది. ఇరాన్ మీడియా మొజ్తాబా ఖమేనిని 'జాన్‌బాజ్ ఆఫ్ రమదాన్' అని అభివర్ణించింది. అంటే యుద్ధంలో గాయపడిన వాడు అని అర్థం. రంజాన్ సమయంలో జరుగుతున్న యుద్ధం కావడంతో కూడా ఇలా వర్ణించింది. యుద్ధంలో శత్రువుల ద్వారా ఖమేని గాయపడినట్లు చేసిన ప్రకటనతో.. ఆయన తాజా యుద్ధంలో గాయపడ్డారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే యుద్ధం ప్రారంభమైన తర్వాత కానీ, తన తండ్రి, భార్య, కుటుంబం మరణించిన తర్వాత కానీ ఆయన ఎప్పుడూ బయట కనిపించలేదు. ఆయనకు సంబంధించిన ఒక ఫొటో, వీడియో కూడా బయటకు రాలేదు. ఆయన్నుంచి ఎలాంటి ప్రకటనా రాలేదు. దీంతో ఆయన గాయపడ్డారేమో అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. అయితే, ఇరాన్ ఛానెల్ చెప్పినట్లు యుద్ధంలో గాయపడటం అంటే ఆయన శరీరానికి అయిన గాయంగానే పరిగణించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఆయన కుటుంబాన్ని కోల్పోవడం కూడా గాయం కిందే లెక్క. దీంతో మొజ్తాబా నిజంగానే గాయపడ్డారా లేదా అనే విషయంలో క్లారిటీ లేదు. ఆయన ఎక్కడున్నారు అనే విషయంలో కూడా స్పష్టత లేదు. ఇక.. మొజ్తాబా ఎన్నికపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహంతోనే ఉన్నాడు. అతడి ఎంపికపై అసంతృప్తితో ఉన్న ట్రంప్.. మొజ్తాబా మనశాంతిగా ఉంటాడని తాను భావించడం లేదన్నారు. మొజ్తాబా ఎంపికను తాను అంగీకరించబోనని, అతడి బదులు ఇరాన్‌లో శాంతిని, సామరస్యాన్ని నింపే నాయకుడిని ఎన్నుకుంటే బాగుంటుందని అభిప్రాయపడ్డాడు.

# బహ్రెయిన్ నుంచి తెలుగు ప్రజల తరలింపు

**హైదరాబాద్: - మార్చి 10 డ్రీమ్ టైమ్స్**
బహ్రెయిన్‌లో చిక్కుకున్న సుమారు 600 మంది తెలుగు ప్రజలను స్వదేశానికి తరలించే ప్రక్రియ ప్రారంభమైంది. ఈరోజు నుంచి రోజూ ఒక విమానంలో వారిని భారత్‌కు తీసుకురావడానికి గల్ఫ్ ఎయిర్ సంస్థతో ఏపీ భవన్ అధికారులు ఏర్పాట్లు చేశారు. డీజీసీఏ, పౌరవిమానయాన శాఖ అధికారులతో చర్చల అనంతరం గల్ఫ్ ఎయిర్ సేవలు ప్రారంభించింది. ఈ రోజు 58 మందిని కొచ్చి విమానాశ్రయానికి తీసుకురానున్నారు



# ఈ నెల 13న రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ నిధులు



**న్యూఢిల్లీ -మార్చి 10 డ్రీమ్ టైమ్స్**
రైతుల కు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం - కిసాన్ నిధులు మార్చి 13న విడుదల కానున్నాయి. ఈ పథకం కింద 22వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విడుదల చేయనున్నారు. దేశవ్యాప్తంగా 9.32 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.2 వేల చొప్పున జమ కానున్నాయి. ప్రధాని మోదీ.. అస్సాంలోని గువాహటి వేదికగా నిర్వహించే కార్యక్రమంలో పీఎం కిసాన్ నిధులను విడుదల చేయనున్నట్లు కేంద్ర వ్యవసాయశాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. పీఎం-కిసాన్ పథకాన్ని 2019లో మోదీ సర్కారు ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తం రూ.6 వేలు రైతుల ఖాతాల్లో వేస్తారు. ఈ దఫా కోసం మొత్తం రూ.19 వేల కోట్ల నిధులను కేటాయించారు.

# ఇరాన్ రాయబారితో ఫరూఖ్ అబ్దుల్లా భేటీ


## ఖమేనీ మృతిపై సంతాపం



**న్యూఢిల్లీ మార్చి 10 డ్రీమ్ టైమ్స్**
భారత్‌లోని ఇరాన్ డిప్యూటీ రాయబారి మహమ్మద్ ఫథాలీతో జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా మంగళవారం భేటీ అయ్యారు. ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయంలో 30 నిమిషాలపాటు ఈ సమావేశం జరిగింది. ఇరాన్‌పై దాడులు త్వరలో ముగిసిపోతాయని, ఆ దేశ ప్రజలు త్వరలో బాధల నుంచి విముక్తి పొందుతారని అబ్దుల్లా ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరాన్ ప్రజలకు అబ్దుల్లా సంఘీభావాన్ని తెలిపారు. కేవలం ఇరాన్ మాత్రమే కాకుండా మొత్తం ప్రపంచం కూడా అవాంఛనీయ సంక్షోభంలో చిక్కుకుందని చెప్పారు. రాయబార కార్యాలయంలో ఉన్న సందర్శకుల పుస్తకంలో 'ఇరాన్ ప్రజలతో నా ప్రార్థనలు, సంఘీభావం ఉన్నాయి' అని అబ్దల్లా రాసారు. అబ్దుల్లాతో పాటు రాయబార కార్యాలయాన్ని సందర్శించిన వారిలో జమ్మూకాశ్మీర్‌కు చెందిన రాజ్యసభ సభ్యులు చౌదరి మహమ్మద్ రంజాన్, సజ్జాద్ అహ్మద్ కిచ్లూ, గుర్విందర్ సింగ్ ఒబెరారు ఉన్నారు.

# మెరికా యుద్ధోన్మాదానికి 193 మంది చిన్నారులు బలి

## ట్రంప్ బెదిరింపులపై ఇరాన్ ఆగ్రహం



**టెహరాన్ మార్చి 10 డ్రీమ్ టైమ్స్**
అమెరికా, ఇజ్రాయిల్ సేనల యుద్ధోన్మాదానికి ఇప్పటి వరకూ 193 మంది ఇరాన్ చిన్నారులు బలయ్యారు. వీరిలో ఎనిమిది నెలల వయసున్న బాలిక కూడా వుందని ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధి తెలిపారు. అమెరికా దాడిలో 11 మంది ఆరోగ్య కార్యకర్తలు కూడా చనిపోయారు. 52 ఆరోగ్య సేవల యూనిట్లు, 29 వైద్య కేంద్రాలు, 19 అత్యవసర యూనిట్లు, 16 అంబులెన్సులపై దాడి జరిగింది. ఇరాన్‌లోని లోరెస్టన్ రాష్ట్రంలో అమెరికా, ఇజ్రాయిల్ సేనలు జరిపిన దాడులలో నలుగురు విద్యార్థులు మరణించారు. రాష్ట్రంలో 52 పాఠశాలలు దెబ్బతిన్నాయి. ఇరాన్‌లో నివసిస్తున్న వేలాది మంది అఫ్ఘన్లు అమెరికా, ఇజ్రాయిల్ సేనల దాడుల కారణంగా ప్రతి రోజూ సరిహద్దును దాటి స్వదేశానికి చేరుకుంటున్నారని ఐరాస శరణార్థి సంస్థ తెలిపింది. ఇరాక్‌లోని కుర్దిస్థాన్ ప్రాంతంలో ఉన్న అమెరికా స్థావరంపై దాడి చేసినట్లు ఐఆర్‌జిసి తెలిపింది.

# పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధం

మొదటి తరువాయి

హతమార్చాం. “ అని పోస్టు చేసింది. మరోవైపు, ఇరాన్ సుప్రీం లీడర్ సైనిక కార్యాలయ కొత్త అధిపతి అబు అల్ ఖాసిం బాబాయాన్‌ను కూడా హతమార్చినట్లు మరో పోస్టులో ఐడీఎఫ్ తెలిపింది. ఆపరేషన్ రోరింగ్ లయన్‌లో భాగంగా ఈ మెరుపు దాడి జరిగిందని పేర్కొంది. మరోవైపు, గల్ఫ్ ప్రాంతంలోనూ యుద్ధం మరింత తీవ్రమవుతోంది. ఈ క్రమంలో సౌదీ ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరం వైపు ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణిని అడ్డగించి నాశనం చేశామని సౌదీ అరేబియా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతినిధి చెప్పారు. దేశ రాజధాని నగరం రియాద్‌లో ప్రయోగించిన రెండు డ్రోన్‌లను తమ దళాలు కూల్చివేసినట్లు పేర్కొన్నారు.వాషింగ్టన్‌తో దౌత్య చర్చలలో తిరిగి పాల్గొనే అవకాశాన్ని తోసిపుచ్చారు. అమెరికాతో చర్చలు జరపడం అనే ప్రశ్న మరోసారి తలెత్తుతుందని తాను అనుకోవట్లేదని తెలిపారు. ఎందుకంటే అమెరికాతో చర్చలు తమకు చేదు అనుభవాన్ని మిగిల్చాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఓ న్యూస్ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. టెహ్రాన్ శత్రువులను ఎదుర్కోవడానికి నిమగ్నమై ఉందని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరఘ్చి స్పష్టం చేశారు. “మేము గతేడాది జూన్‌లో అమెరికాతో చర్చలు జరిపాం. చర్చల మధ్యలో అమెరికా మాపై దాడి చేసింది. ఈ ఏడాది మళ్లీ చర్చలు ప్రారంభించాం. మాపై దాడి చేయాలనే ఉద్దేశ్యం లేదని వారు మాకు హామీ ఇచ్చారు. ఇరాన్‌తో అణు సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకుంటామని, చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం కనుగొంటామని అన్నారు. దౌత్యపరమైన పురోగతి లభించేటప్పటికే ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా కలిసి దాడులకు దిగాయి. కాబట్టి అమెరికాతో చర్చలు ఇకపై మా అజెండాలో లేవు. “ అని సయ్యద్ అబ్బాస్ స్పష్టం చేశారు. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా మోజ్తాబా ఖమేనీ ఎంపిక కావడంపైనా సయ్యద్ అబ్బాస్ స్పందించారు. ఈ నియామకాన్ని ఒక రకమైన స్థిరత్వానికి సంకేతంగా అభివర్ణించారు. కొత్త నాయకుడి నిర్దిష్ట విధాన వైఖరి సకాలంలో వెల్లడిస్తారని తెలిపారు. ఈ యుద్ధంలో అమెరికా, ఇజ్రాయెల్ విఫలమయ్యాయని అన్నారు. “వాస్తవానికి ఇజ్రాయెల్, అమెరికా కొన్ని లక్ష్యాలను సాధించడానికి ప్రయత్నించాయి. అందులో కొన్నింటిని సాధించాయి. రెండు– మూడు రోజుల్లో ఇరాన్‌లో పాలనా మార్పును తీసుకురావొచ్చని అనుకున్నారు. యుద్ధంలో వేగంగా విజయం సాధించవచ్చని భావించారు. కానీ వారు విఫలమయ్యారు. ప్రపంచ ఇంధన సరఫరాల అంతరాయం, చమురు ధరలు పెరగడంలో మా తప్పు లేదు. అది మా ప్లాన్ కూడా కాదు. చమురు ఉత్పత్తి, రవాణా మందగించింది. ఇజ్రాయెల్, అమెరికా మాపై చేసిన దాడులు, దురాక్రమణ కారణంగానే అది జరిగింది. ట్యాంకర్లు, ఓడలు హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లడానికి భయపడుతున్నాయి. మేము ఆ జలసంధిని మూసివేయలేదు.” అన్నారు. ఇరాన్ రాజకీయ భవిష్యత్తు పూర్తిగా ఆ దేశ ప్రజల చేతుల్లోనే ఉందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్? నెతన్యాహు అన్నారు. ఇరాన్? ప్రజలపై రుద్దబడిన నిరంకుశ పాలనను అంతం చేయాలన్నదే తమ ఆకాంక్ష అని, అయితే అది ఆ దేశ ప్రజల పోరాటం ద్వారానే సాధ్యమని స్పష్టం చేశారు. మంగళవారం నేషనల్? హెల్త్ ఎమర్జెన్సీ ఆపరేషన్స్? సెంటర్?ను సందర్శించిన సందర్భంగా ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.”నిరంకుశత్వ సంకెళ్లను తెంచుకునే శక్తిని ఇరాన్ ప్రజలకు కల్పించాలన్నదే మా ఆకాంక్ష. అయితే అంతిమంగా అది ఆ దేశ ప్రజల నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. ఇజ్రాయెల్ ఇప్పటి వరకు చేపట్టిన సైనిక చర్యల వల్ల ఇరాన్ పాలక వ్యవస్థ పూర్తిగా బలహీనపడింది. మేము ఇక్కడితో ఆగము. మా సైనిక చర్యలు ఇంకా కొనసాగుతాయి. మేము ఇరాన్ ప్రజలతో కలిసి విజయం సాధిస్తే, అది ప్రాంతీయంగా శాశ్వతమైన మార్పునకు దారితీస్తుందని అన్నారు. ఇజ్రాయెల్ ఆరోగ్య శాఖా మంత్రి హైమ్ కాట్జ్?తో కలిసి ‘ నేషనల్ హెల్త్ కమాండ్ సెంటర్?ను నెతన్యాహు సందర్శించిన ఆయనకు, ఆపరేషన్ రోరింగ్ లయన్?లో భాగంగా చేపడుతున్న కార్యక్రమాల గురించి ఆరోగ్య శాఖ డైరెక్టర్? జనరల్ మోషే బార్ సిమాన్ టోవ్ వివరించారు.మరోవైపు యుద్ధం ముగింపు దశకు వచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను ఇరాన్ తోసిపుచ్చింది. అమెరికా, ఇజ్రాయెల్?ల్లోని లక్ష్యాలపై దాడులను ఎప్పుడు ముగించాలో నిర్ణయించే ఏకైక అధికారం తమకే ఉందని ఇరాన్ స్పష్టం చేసింది. “యుద్ధం ఎప్పుడు ముగియాలో మేము నిర్ణయిస్తాం. ప్రాంతీయ సమీకరణాలు, భవిష్యత్ స్థితిగతులు ఇప్పుడు మా సాయుధ దళాల చేతిలో ఉన్నాయి. అమెరికా దళాలు ఈ యుద్ధాన్ని ముగించలేవు” అని ఐఆర్?జీసీ ఘాటు వ్యాఖ్యలు చేసింది. అంతేకాదు గతంలో ఎదుర్కొన్న ఘోర పరాజయాలను కప్పిపుచ్చుకోవడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్? కుట్రలు, మోసపూరిత మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. ఇంతకు ముందు డొనాల్డ్ ట్రంప్ పశ్చిమాసియా ఉద్రిక్తతల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై చేస్తున్న యుద్ధం చాలా వరకు పూర్తైందని, గతంలో అంచనా వేసిన దానికంటే త్వరగా (నాలుగైదు వారాల్లోగా) యుద్ధం ముగిస్తుందని పేర్కొన్నారు. ఇరాన్‌కు ఇప్పుడు నేవీ, ఎయిర్‌ఫోర్స్, కమ్యూనికేషన్ వ్యవస్థలు లేవని, వారి క్షిపణులు సర్వనాశనం అవుతున్నాయని పేర్కొన్నారు. కానీ, కొన్ని గంటల తర్వాత ట్రంప్ తన మాట మార్చారు. ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ‘ఇరాన్‌తో చేస్తున్న యుద్ధంలో అమెరికా అన్ని విధాలా పై చేయి సాధించిందని, కానీ ఇంకా పూర్తి స్థాయిలో గెలవలేదని చెప్పుకొచ్చారు.

# దేశంలో గ్యాస్ కొరత

మొదటి తరువాయి

రాజధాని బెంగళూరు వాణిజ్య గ్యాస్ సిలిండర్ల కొరతను ఎదుర్కొంటోంది. నగరంలోని ఆహార పరిశ్రమతో పాటు, రోజూ బయట భోజనం చేసే వారు కూడా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. బెంగళూరు హోటల్స్ అసోసియేషన్ నగరం అంతటా హోటళ్ళు రేపటి నుంచి మూసివేస్తున్నట్టు ప్రకటించింది. సిలిండర్లు ప్రస్తుతం స్టాక్‌లో ఉన్నందున కొన్ని హోటళ్ళు ఈరోజు తెరిచి ఉన్నాయి. స్టాక్ అయిపోయిన తర్వాత, గ్యాస్ సరఫరా లేకపోవడం వల్ల హోటళ్ళు మూసివేస్తున్నారు. చాలా ప్రధాన హోటళ్లలో కొన్ని గంటల సరఫరా మాత్రమే మిగిలి ఉంది. రాబోయే మూడు రోజులు గ్యాస్ కొరత కొనసాగితే, ముంబైలోని 50% హోటళ్ళు మూతపడే అవకాశం ఉందని హోటల్ నిర్వాహకులు చెబుతున్నారు. ముంబైలోని డోంగ్రి ప్రాంతంలోని అన్ని హోటళ్ళు మూసివేశారు. ఢిల్లీలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలోని గిడ్డంగిలో ఖాళీ వాణిజ్య సిలిండర్లు పడి ఉన్నాయి. గత రెండు రోజులుగా వాణిజ్య సిలిండర్ల సరఫరా లేదు. వాణిజ్య సిలిండర్లు ప్రస్తుతం రావని పై వారికి సమాచారం ఇచ్చామని ఇన్‌ఛార్జ్, మేనేజర్ చెబుతున్నారు. “డొమస్టిక్ బుకింగ్‌లు మాత్రమే సరఫరా అవుతున్నాయి. హోటల్ యజమానులు వస్తున్నారు, కానీ వద్ద సిలిండర్లు లేవు. మేము ప్రతిరోజూ 60 నుంచి 70 వాణిజ్య సిలిండర్లను సరఫరా చేసేవాళ్ళం, కానీ గత రెండు రోజులుగా స్టాక్ లేదని మేనేజర్ చెబుతున్నారు. ఖాళీ వాణిజ్య సిలిండర్లు ఇక్కడ పడి ఉన్నాయి. నిండినవి రాకపోతే అవి ఇక్కడే ఖాళీగా పడి ఉంటాయి.” గ్యాస్ కొరత లక్నోలో కూడా ఉంది. గ్యాస్ ఏజెన్సీల ముందు పెద్ద ఎత్తున జనం క్యూలు కడుతున్నారు, కానీ గ్యాస్ సరఫరాలు అందడం లేదు. కొత్త గ్యాస్ బుకింగ్‌లు ఇప్పుడు ఆగిపోయాయని ప్రజలు చెబుతున్నారు. కొంతమందికి ఒక నెల క్రితం గ్యాస్ బుకింగ్‌లు ఉన్నాయని, మరికొందరు రెండు నెలల క్రితం గ్యాస్ బుకింగ్‌లు చేశారని, ఇప్పుడు కొత్త గ్యాస్ బుకింగ్‌లు ణూజ నంబర్‌ను చూపించడం లేదని చెబుతున్నారు. చండీగఢ్‌లోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ గిడ్డంగిలో పెద్ద సంఖ్యలో వాణిజ్య గ్యాస్ సిలిండర్లు కనిపిస్తున్నాయి. సిబ్బంది చెప్పిన వివరాలు చూస్తే, గత నాలుగు రోజులుగా వాణిజ్య సిలిండర్ల సరఫరా లేదు, దీని కారణంగా వస్తున్న సిలిండర్లను ఇక్కడ ఉంచుతున్నారు. ఉద్యోగి సోను ప్రకారం, హోటల్, రెస్టారెంట్ యజమానులు సిలిండర్ల గురించి అడుగుతున్నారు. కానీ మా దగ్గర సిలిండర్లు అందుబాటులో లేవు. అతని ప్రకారం, దేశీయ గ్యాస్ సరఫరా కూడా సగానికి తగ్గించారు.మధ్యప్రదేశ్‌లో కూడా వాణిజ్య గ్యాస్ సిలిండర్లను నిషేధించారు. రాజధాని భోపాల్‌లోని హోటళ్ల యజమానులు వాటిని పొందలేకపోతున్నారు. నిన్న సాయంత్రం నుంచి, భోపాల్‌లోని రెస్టారెంట్లు, హోటళ్లు, దుకాణాలకు సామాగ్రి అందలేదు. పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు భారతీయ వంటగదిపై, ముఖ్యంగా హోటల్ రంగంపై పెను ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇరాన్ వివాదం కారణంగా అంతర్జాతీయ సరఫరా గొలుసు దెబ్బతినడంతో దేశవ్యాప్తంగా ఎల్‌పీజీ కొరత మొదలైంది. దేశవ్యాప్తంగా హోటల్స్ మూతపడుతున్నాయి. నిత్యం కస్టమర్లతో కిటకిటలాడే హోటల్స్ తయారీని పరిమితం చేసుకుంటున్నాయి. గ్యాస్ లేకపోవడంతో వంటలు చేయలేక, హోటల్ యాజమాన్యాలు తమ కస్టమర్లకు కేవలం కుర్మా, సాంబార్ వంటి ముందే సిద్ధం చేసిన పదార్థాలను మాత్రమే వడ్డిస్తున్నాయి. నేటికి ఎలాగోలా సర్దుబాటు చేశాంకానీ, రేపటి నుంచి గ్యాస్ లేకపోతే హోటల్ నడపడం అసాధ్యం అని హోటల్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఒక్క హోటల్ పరిస్థితి మాత్రమే కాదు దేశవ్యాప్తంగా వందలాది హోటళ్లు ఇదే కారణంతో మూతపడే దిశగా వెళ్తున్నాయి. గల్ఫ్ దేశాల నుండి రావాల్సిన గ్యాస్ నిలిచిపోవడంతో బల్క్ సరఫరాపై ఆధారపడే కమర్షియల్ హోటల్ రంగం కుప్పకూలుతోంది. భారతదేశం తన ఎల్‌పీజీ అవసరాలలో దాదాపు 40 నుంచి 45 శాతం వరకు దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇందులో సింహభాగం ఇరాన్, యూఏఈ, కతార్ వంటి దేశాల నుంచే వస్తుంది. హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతల వల్ల సరఫరా నిలిచిపోవడంతో, కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కోటాపై తీవ్రమైన ఆంక్షలు విధించారు. హోటల్ అసోసియేషన్లు వెల్లడిస్తున్న సమాచారం ప్రకారం, మెట్రో నగరాల్లోని చిన్న, మధ్యతరహా హోటళ్లు గ్యాస్ అందక సగానికి పైగా మెనూని తగ్గించేశాయి. మరికొన్ని చోట్ల కట్టెల పొయ్యిలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సంక్షోభం కేవలం వంట గ్యాస్ కొరతకే పరిమితం కాకుండా, ధరల పెరుగుదలకు కూడా దారితీస్తోంది. అందుబాటులో ఉన్న కొద్దిపాటి గ్యాస్‌ను బ్లాక్ మార్కెట్‌లో భారీ ధరలకు విక్రయిస్తుండటంతో హోటల్ నిర్వాహకులపై ఆర్థిక భారం పెరుగుతోంది. ఇది చివరకు సామాన్యుడి కంచంపై ప్రభావం చూపుతోంది. హోటళ్లలో టిఫిన్, భోజనాల ధరలు ఇప్పటికే 20% వరకు పెరిగాయి. యుద్ధం గనుక సుదీర్ఘకాలం కొనసాగితే, విమానయాన, రవాణా రంగాల తర్వాత అత్యంత దెబ్బతినేది హోటల్, క్యాటరింగ్ రంగమేనని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతానికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గ్యాస్ నిల్వలను సమకూర్చుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, డిమాండ్‌కు సరిపడా సరఫరా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. చెన్నై నుంచి ఢిల్లీ వరకు ప్రతి వీధిలోని హోటల్ యజమాని ఇప్పుడు యుద్ధం ఎప్పుడు ఆగుతుందా అని ఆకాశం వైపు చూస్తున్నారు. గ్యాస్ సిలిండర్ రాక ఆగిపోతే, వేలమంది కార్మికుల ఉపాధి దెబ్బతినడమే కాకుండా, దేశీయ ఆహార రంగం సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో గ్యాస్ కొరతపై డిస్ట్రిబ్యూటర్ల అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి స్పందించారు. మన రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎల్పీజీ కొరత వచ్చే అవకాశం లేదని, పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఇబ్బందులు ఎదురవకుండా మాత్రమే కేంద్రం అప్రమత్తమైందని తెలిపారు. గృహ వినియోగదారులకు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రం ముందస్తు చర్యలు చేపట్టిందని స్పష్టం చేశారు. కాగా ఇప్పటికే వ్యాపార, హోటల్స్‌కు సిలిండర్లను నిలుపుదల చేస్తూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి.డిస్ట్రిబ్యూటర్ల నుంచి 19 కిలోల వాణిజ్య సిలిండర్ల సరఫరా దాదాపు ఆగిపోయింది. హాస్టళ్లకు, ఆస్పత్రులు లాంటి అత్యవసర విభాగాలకు ఎస్మా నుంచి మినహాయింపును ఇచ్చారు. గ్యాస్ సరఫరా విషయంలో కొన్ని విభాగాలకు పరిమితులు విధించారు. యుద్ధం కారణంగా సరిపడినంత గ్యాస్ సరఫరా లేకపోవడంపై ఉన్నత స్థాయిలో కమిటీ ఏర్పాటు చేశారు. అందుబాటులో ఉన్న గ్యాస్ ఏయే రంగాలకు సరఫరా చేయాలన్న దానిపై అధ్యయనం చేస్తున్నారు. కమిటీ సిఫారసుల మేరకు ఆయిల్ కంపెనీలు గ్యాస్ సరఫరాను కొనసాగించనున్నాయి. గృహ వినియోగదారులు గ్యాస్‌ను పొదుపుగా వాడుకోవాలని, అవకాశం ఉన్నంత వరకు ఇండక్షన్ స్టవ్ లాంటి వాటిని వాడుకోవాలని అధికారులు సూచించారు.

# త్వరలోనే ఇరాన్ యుద్ధం ముగింపు

మొదటి తరువాయి

పరిష్కరించుకోటంపై ఇరువురు నేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నట్లు తెలిపింది. ఉక్రెయిన్ యుద్ధం, వెనెజువెలా అంశాలు కూడా ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చినట్లు క్రెమ్లిన్ తెలిపింది. ఈ చర్చలు యుద్ధ వాతావరణాన్ని తగ్గించేందుకు ఉపయోగపడతాయని భావిస్తున్నట్లు రష్యా తెలిపింది. మరోవైపు ఇరాన్‌పై యుద్ధం చాలా వరకు పూర్తైందని, గతంలో అంచనా వేసిన నాలుగైదు వారాల కన్నా ముందే ముగిసిపోతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. ఇరాన్‌కు ఇప్పుడు నేవీ, ఎయిర్‌ఫోర్స్, కమ్యూనికేషన్లు లేవని, వారి క్షిపణులు చెల్లాచెదురుగా పడుతున్నాయని తెలిపారు. ఆసియాకప్‌లో పాల్గొన్న ఇరాన్ మహిళా ఫుట్‌బాల్ జట్టును స్వదేశానికి పంపవద్దని ఆస్ట్రేలియాను కోరారు. వారికి అక్కడే ఆశ్రయం కల్పించాలని సూచించారు. లేకుంటే అమెరికా వారిని చేరదీస్తుందని ట్రంప్ అన్నారు. ఇరాన్ సుప్రీం లీడర్‌గా మొజ్తబా ఖమేనీని ఎంపిక చేయడంపై ట్రంప్ విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో ఇరాన్ పెద్ద తప్పు చేసిందన్నారు. మొజ్తబా ఎంతకాలం పదవిలో కొనసాగుతారో తెలియదని, ఐతే ఆయన ఎంపిక సరైన నిర్ణయం కాదని తాను భావిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. తన మనసులో మొజ్తబా ఖమేనీకి బదులుగా మరొకరు ఉన్నారని వివరించారు. అణు కార్యక్రమాలు, క్షిపణి పరీక్షలు ఆపాలన్న అమెరికా డిమాండ్‌ను అంగీకరించకుంటే మొజ్తబాను లక్ష్యంగా చేసుకోవడానికి వెనుకాడబోమని ట్రంప్ తన సన్నిహితుల్తో అన్నట్లు అమెరికా మీడియా తెలిపింది. అటు ఇరాన్ చమురు క్షేత్రాలను ఆధీనంలోకి తీసుకోవడం గురించి ఇప్పుడే మాట్లాడితే తొందరపాటు అవుతుందన్నారు.మరోవైపు ఇంధన ధరలు నియంత్రించే క్రమంలో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. కొన్ని రకాల చమురు ఆంక్షలను తొలగించనున్నట్లు వెల్లడించారు. యుద్ధం నేపథ్యంలో ముడి చమురు ధరలు పెరగకుండా, నిరంతర సరఫరా కొనసాగడానికి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ వివరించారు. ‘మేము కొన్ని దేశాలపై ఆంక్షలు విధించాం. పరిస్థితి సాధారణ స్థితికి వస్తే మేము ఆ ఆంక్షలు తొలగిస్తాం’ అని చెప్పారు. అయితే, దీనికి సంబంధించి పూర్తి వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. ఈ సందర్భంగా హర్మూజ్ జలసంధి మీదుగా వెళ్లే చమురు ట్యాంకర్లకు తమ నౌకాదళాలు, భాగస్వాములు కలిసి రక్షణ కల్పిస్తాయని ట్రంప్? పేర్కొన్నారు. సైనిక చర్య చేపడితే చమురు ధరలు పెరుగుతాయని తనకు ముందే తెలుసని, అయితే, ఇరాన్ అణు క్షిపణులు సమకూర్చుకోకూడదనే తాను ఈ చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇక, చమురు సరఫరాను అడ్డుకునేందుకు ఇరాన్ ప్రయత్నిస్తే దానిపై భీకర దాడి చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. ‘ఇరాన్ ప్రభుత్వం ప్రపంచాన్ని ఇబ్బందిపెట్టేందుకు చమురు రవాణాను అడ్డుకోవడానికి ప్రయత్నించడాన్ని నేను అస్సలు సహించను. ఒకవేళ వారు అలా చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవు’ అని ట్రంప్ వెల్లడించారు. మరోవైపు ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం ముగింపు విషయంపై ట్రంప్ విరుద్ధ ప్రకటనలు చేశారు. యుద్ధం చివరిదశకు చేరుకుందని, అమెరికా– ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన ఈ సైనిక చర్య చాలావరకు పూర్తయ్యిందని చెప్పారు. కానీ, కొన్ని గంటల తర్వాత జరిగిన మరో కార్యక్రమంలో ఇదే విషయంపై ట్రంప్ మరోరకంగా స్పందించారు. ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా అన్నివిధాలా గెలిచిందని, కానీ ఇంకా తగినంత గెలవలేదని చెప్పుకొచ్చారు. ఇరాన్ పూర్తిగా ఓడిపోయే వరకు యుద్ధం కొనసాగుతోందని స్పష్టం చేశారు.

## బెంగాల్లో ప్రశాంతంగా
# ఎన్నికల నిర్వహణ

మొదటి తరువాయి

పాటు సమీక్ష సమావేశాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని చట్ట అమలు సంస్థలు భయం లేదా పక్షపాతం లేకుండా వ్యవహరించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఓటింగ్ శాతం అధికంగా ఉందని, ఓటర్లు మరియు ప్రజలు రాజ్యాంగాన్ని గౌరవిస్తారని అన్నారు. శాంతియుతంగా, స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో పోలింగ్ జరిగేలా చూడాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కాగా, ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించేందుకు వచ్చిన సీఈసీకి మంగళవారంనాడు కూడా నిరసనల సెగ తప్పలేదు. మంగళవారం ఉదయం దక్షిణెశ్వర్ కాళి ఆలయాన్ని సందర్శించేందుకు ఆయన వచ్చినప్పుడు కొందరు నల్లజెండాలతో నిరసన తెలుపుతూ ’గో బ్యాక్’ నినాదాలు చేశారు. ఆదివారం రాత్రి సీఈసీ రాక సందర్భంగా నేతాజి సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం బయట కూడా ఇలాంటి నిరసన ప్రదర్శనలు చేటుచేసుకున్నాయి. ఎస్ఐఆర్ పక్రియ అనంతరం విడుదల చేసిన ఓటర్ల తుదిజాబితా నుంచి పక్షపాత ధోరణితో పెద్దఎత్తున పేర్లు తొలగించారని నిరసన ప్రదర్శకులు ఆరోపిస్తున్నారు.

# లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లపై అవిశ్వాసం

మొదటి తరువాయి

చైర్ పర్సన్స్ ప్యానెల్ సభ్యుడు జగదాంబికా పాల్‌ను నియమించింది. ఆయన నేతృత్వంలో ప్రస్తుతం స్పీకర్ ఓం బిర్లా అవిశ్వాస తీర్మానంపై చర్చ చేపట్టారు. ప్రతిపక్షాల తరపున కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ.. భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం సహా పలు అంశాలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి మాట్లాడేందుకు యత్నించారని, కానీ స్పీకర్ అనుమతినివ్వలేదని అన్నారు. ప్రతిపక్ష ఇండియా కూటమికి లోక్‌సభలో సుమారు 200మంది సభ్యులున్నప్పటికీ.. డిప్యూటీ స్పీకర్ లేరని అన్నారు. డిప్యూటీ స్పీకర్ లేకుండా సభ ఎలా నడుస్తుందో దేశ ప్రజలు చూడాలని అన్నారు. మైక్‌ని కూడా ఆయుధంగా వినియోగి స్తున్నారని అన్నారు. ఎన్‌డిఎ సభ్యులకు మాట్లాడేందుకు అనుమతినిస్తున్నారని, కానీ ప్రతిపక్షాలకు మాట్లాడేందుకు మైక్‌ని ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని అన్నారు. అయితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సభలో హుందాగా మెలగడం లేదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. ఈ క్రమంలో గతంలో ప్రధాని మోదీని రాహుల్ ఆలింగనం చేసుకున్న ఘటనను ప్రస్తావించారు. ప్రధాని మోదీ దగ్గరకు వచ్చిన రాహుల్.. ఆలింగనం చేసుకొని వెళ్లి తన సీట్లో కూర్చున్నారు. అనంతరం తోటి ఎంపీలను చూసుకుంటూ కళ్లు ఎగరవేశారు. అటువంటి నేతను ఎప్పుడూ చూడలేదు‘ అని కిరణ్ రిజిజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గతంలో నెహ్రూ చెప్పిన నాటి స్పీకర్ జీవీ మావలాంకర్‌ను సమర్థిస్తూ మాటలను గుర్తుంచుకోవాలని కాంగ్రెస్ నేతలకు సూచించారు. దీనిపై దీటుగా స్పందించిన ప్రియాంకా గాంధీ.. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.రిజిజు విమర్శలను ఎంపీ ప్రియాంకా గాంధీ తిప్పికొట్టారు. విపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పే విషయాలను అధికార పక్షం జీర్ణించుకోలేక పోతోందన్నారు. గడిచిన 12 ఏళ్లలో ప్రభుత్వానికి దీటుగా నిలిచిన వ్యక్తి రాహుల్ ఒక్కరేనని అన్నారు. నెహ్రూను ఎప్పుడూ విమర్శించే వాళ్లు అకస్మాత్తుగా ఆయన్ను ప్రశంసించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అందుకే తనకు నవ్వు వస్తోందన్నారు. నిరంతరం నెహ్రూను ఆడిపోసుకుంటున్న వారు ఆయన గురించి మాట్లాడంతో నవ్వు ఆపుకోలేక పోయానని అన్నారు. అయితే, ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ సభలో లేని సమయంలో ఈ చర్చ జరిగింది. ఆ సమయంలో స్పీకర్ స్థానంలో టిడిపికి చెందిన తెన్నేటి కృష్ణప్రసాద్ ఉన్నారు.

# ఎన్నిసార్లు చెప్పాలి?

మొదటి తరువాయి

తాను వారిని పిలిచి హెచ్చరించడంతో 15 మంది దారికొచ్చారని, మిగిలిన వారు వ్యవహరిస్తున్న తీరుపై తన వద్ద నివేదికలు ఉన్నాయన్నారు. త్వరలో నలుగురైదుగురిపై వేటు తప్పదని సీఎం.. మంత్రుల వద్ద వ్యాఖ్యానించారు. అలాంటి వారిని పిలిచి ఫైనల్‌గా మాట్లాడతానని, పద్ధతి మార్చుకోకపోతే మాత్రం తనతో వారికి అదే చివరి సమావేశం అవుతుందన్నారు. రాబోయే స్థానిక సంస్థలు, సార్వత్రిక ఎన్నికల్లోపే కఠిన నిర్ణయాలు ఉంటాయని, పనిచేయని వారి స్థానంలో వేరే నాయకులు పనిచేస్తారని తెలిపారు. ఈసారి పార్టీ గెలుపు ముఖ్యమని, వ్యక్తుల కోసం పార్టీని బలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అవసరమైతే కొంతమందిని వదులుకొని ముందుకు వెళ్లిపోతామన్నారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని అసెంబ్లీ వేదికగా తిప్పికొట్టగలిగామని, ఏకసభ్య కమిషన్ నివేదిక వచ్చిన తర్వాత మరిన్ని నిజాలు వెలుగులోకి వస్తాయని సీఎం వ్యాఖ్యానించారు. మండలిలో తిరుమల నెయ్యి కల్తీపై వైసీపీ సభ్యులు మాట్లాడకుండా ఇందాపూర్‌పై మాట్లాడి అసలు విషయాన్ని పక్కదోవ పట్టించే ప్రయత్నం చేశారని, ఈ విషయాన్ని ప్రజలు గమనించారని తెలిపారు.మద్యం కుంభకోణంలో వైసీపీ వ్యవహరించిన తీరును, డిస్టలరీల నుంచి తీసుకున్న ముడుపుల వ్యవహారాన్ని ప్రజలు సీరియ్‌సగా తీసుకున్నారన్నారు. ముఖ్యంగా నాసిరకం మద్యం కారణంగా ప్రజల ఆరోగ్యం దెబ్బతిన్న వ్యవహారం ప్రజల్లో చర్చనీయాంశంగా మారిందని మంత్రులు.. సీఎంకు వివరించారు. మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసులు కూడా త్వరలోనే విచారణకు వచ్చే అవకాశం ఉందని, డిశ్చార్జి పిటిషన్లు వేసి విచారణలో జాప్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అయితే ఈ పిటిషన్లను హైకోర్టు, సుప్రీంకోర్టులు కొట్టివేస్తున్నాయని మంత్రులు వ్యాఖ్యానించారు. ఈ కేసుల విచారణ ప్రారంభమైతే జగన్ ప్రతి రోజూ కోర్టుకు వెళ్లాల్సి వస్తుందన్నారు. కాగా, వైసీపీ హయాంలో దళితులు, బీసీలు, ఇతర వర్గాలపై జరిగిన దాడుల కేసుల పురోగతిపై కూడా చర్చ జరిగింది. అనంతబాబు డ్రైవర్ సుబ్రమణ్యం హత్య, రేపల్లెలో అమర్‌నా?థ్ గౌడ్‌ను సజీవదహనం చేయడం, మాచర్లలో చంద్రయ్య హత్య కేసు, ఇతర కేసుల పురోగతిపై చర్చించారు. వీటిని ప్రజలకు ఎప్పటికప్పుడు గుర్తు చేయాలని నిర్ణయించారు.

# తెలుగు వైభవాన్ని చాటేలా అమరావతి

మొదటి తరువాయి

వివిధ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాజధానిలో సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టుల స్థాపనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ‘రాజధాని పరిధిలోని నీరుకొండ వద్ద చేపట్టే పర్యాటక ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి. పర్యాటకులను ఆకర్షించేలా ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు తెలుగు వైభవాన్ని చాటేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలి. ఈ ప్రాజెక్టులో వాటర్ ఫ్రంట్, కల్చరల్ సెంటర్ తదితర విభాగాలు వస్తాయి. పర్యాటకంతోపాటు నిత్యం వివిధ కార్యక్రమాలు నిర్వహించుకునే వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలి. హోటళ్లను ఏర్పాటు చేయాలి. భవిష్యత్తులో క్రీడారంగం అతి పెద్ద ఆదాయ వనరు కాబోతోంది. దీనికి బీసీసీఐ, ఐసీసీ సంస్థలే పెద్ద ఉదాహరణ. ఒకప్పుడు నిధుల కోసం ఎదురుచూసే పరిస్థితి నుంచి నేడు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలుగా క్రికెట్ బోర్డులు ఎదిగాయి. ఇదేవిధంగా మరికొన్ని క్రీడలు కూడా కమర్షియల్‌గా టర్న్ అవుతాయి. ఇలాంటి వాటిని అందిపుచ్చుకోవాలి. అమరావతిలోని స్పోర్ట్స్ సిటీకి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను ఇదే విధంగా రూపొందించాం.అమరావతిలోకి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులను తీసుకురావాలి. రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ఆయా సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూనే ఉండాలి. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సైబర్ సిటీలో పెట్టుబడులు పెట్టలేకపోయినందుకు డీఎల్ఎఫ్ వంటి సంస్థలు ఇప్పుడు చింతిస్తున్నాయి. ఈసారి అమరావతిలో అలాంటి అవకాశాన్ని వదులుకోకూడదని భావిస్తున్నాయి. ఇదీ మన ప్రభుత్వానికి ఉన్న క్రెడిబులిటీ. ఈ బ్రాండ్ మరింతగా పెరగాలి. అందుకే పెట్టుబడులు పెట్టేవారిని నిరంతరం ఫాలోఅప్ చేస్తూనే ఉండాలి. ఓ వైపు రాజధానిలో పనులను త్వరితగతిన చేపట్టేలా పర్యవేక్షణ చేస్తూనే.. మరోవైపు పెట్టుబడులు పెట్టే సంస్థలతో నిత్యం సంప్రదింపులు జరుపుతూనే ఉండాలి. అమరావతిలో నిర్మించబోతున్న తెలుగు కల్చరల్ సెంటర్‌కు మంచి పేరును పరిశీలించండి.’ అని సీఎం కోరారు.

# సంపాదకీయం

## యువ క్రికెటర్లకు ప్రేరణ




తొలిసారిగా కపిల్ దేవ్ సార్థ్యంలోని క్రికెట్ టీమ్ ప్రపంచ కప్ గెలిచిన 1983 నుంచి ఇప్పటి వరకు అనేక మార్పులు వచ్చాయి. క్రికెట్‌లో రూల్స్ మారాయి. అనేక నిబంధనలు వచ్చి పడ్డాయి. ట్వంటీ ట్వంటీ వచ్చింది. కొత్తగా ఐపిఎల్ మ్యాచ్‌లు వచ్చాయి. ఇవన్నీ కూడా యువ క్రెటర్లను ఆకర్షిస్తున్నాయి. ఇలా ఎన్ని మార్పులు వస్తున్నా..భారత్ క్రికెట్ వన్నె తగ్గకుండా పోరాడుతున్న స్ఫూర్తి అభినందనీయం. అంతేకాదు.. భారత్ క్రికెట్‌లో కొత్త నీరు నిరంతరంగా ప్రవహిస్తూనే ఉంది. సచిన్ టెండూల్కర్, గంగూలీ, యువరాజ్ సింగ్, జడేజా, వీరేంద్ర సెహ్వాగ్ ఇలా ఎందరో క్రికెటర్లు మన టీమ్ పనితనాన్ని మెరుగు పర్చారు. ధోనీ, విరట్ కోహ్లీ, రోహిత్ శర్మ లాంటి వారు క్రికెట్ స్వరూపాన్నే మార్చేశారు. ఇక మొన్న జరిగిన టీ ట్వంటీ వరల్డ్ కప్ పోటీల్లో భారత్ మరోమారు సత్తా చాటింది. ఇందులో గమనించాల్సిన విషయం ఏమంటే సంజూ శంసన్ విశ్వరూపం. అతడి ఆటతీరు చూడగానే సమయాను కూలంగా ధోనీలా, విరాట్‌లా, రోహిత్ శర్మలా విజృంభించగల నైపుణ్యం కనిపించింది. అన్నింటికి మించి అతను చేసిన ఓ చిన్న పని భారత ఔన్నత్యాన్ని, క్రికెట్ గొప్పతనాన్ని చాటింది. ఇంగ్లడ్తో జరిగిన సెమీస్‌లో సెంచరీ మిస్ అయిన సంజూ శాంసన్ మ్యాన్ ఆఫ్‌ది మ్యా,÷‒÷‒గా ఎన్నికయ్యాడు. కానీ భారత్ విసిరిన 250 పైన పరుగుల ఛాలెంజ్‌లో ఇంగ్లడ్ యువ కిశోరం బెథెల్ అద్భుతంగా రాణించాడు. ఒంటరి పోరుతో సెంచరీతో భారత్‌కు వణుకు పుట్టించాడు. అతను ఔట్ కాకుండా ఉంటే...భారత్ వెనుదిరుగేదే. సంజూ శాంసన్ తనకు దక్కిన మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును బెథెల్‌కు అందించారు. అతనే నిజమైన హీరో అని పొగిడారు. సంజూ చేసిన ఈ ఒక్క పనితో భారత్ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటింది. అయితే అదే సంజూను మనం గుర్తించి, జట్టులోకి తీసుకోవడం లో రాజకీయాలు ఆడామని ఒప్పుకోవాల్సిందే. ప్రతిభకు ఏదీ అడ్డం కాదని, క్రీడల్లో రాజకీయాలు ఉండరాదని మనం గుర్తించాలి. అందులే ఇలాంటి వారందరినీ స్ఫూర్తిగా యువతలో కొత్త ఆశలు చిగురింప చేశారు. క్రికెట్‌లోచోటు దక్కేది 11 మందికే అని తెలిసినా భారత యువరక్తం ఇప్పుడు లక్షల్లో శిక్షణ తీసుకుంటున్నారు. తామూ క్రికెటర్లుగా ఎదగాలనుకుంటున్నారు. ఇలాంటి వారు జాతీయ జట్టులో చోటు దక్కించుకోకున్నా, క్రికెట్‌ను నిలబడెతున్నారని తెలుసుకోవాలి. అందుకే ఇప్పుడు ఎక్కడ చూసినా క్రికెట్ కోచింగ్ సెటర్లు వెలిశాయి. ప్రతి ఇంట్లో ఒకరు క్రికెట్ బ్యాట్ పట్టుకుని మైదానంలోకి పరుగెడుతున్నాడు. ఇది ఓ రకంగా ప్రేరణ. యువతకు స్ఫూర్తి. అటు విమెన్ క్రికెట్ అయినా, ఇటు మెన్ క్రికెట్ అయినా ప్రతి ఒక్కరూ శిక్షణకు దిగుతున్నారు. మొత్తంగా టీమిండియా వరుసగా రెండోసారి, మొత్తంగా మూడో పర్యాయం టీ20 ప్రపంచకప్‌లో చాంపియన్‌గా నిలిచింది. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ వంటి యోధులు ఇప్పుడున్న జట్టుకు వెన్నముక గా నిలిచారు. జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌ను ముందుండి నడిపించాడు. అవసరమనుకున్న ప్రతిసారీ వికెట్ పడగొట్టి ప్రస్తుత తరంలో ప్రపంచ అత్యుత్తమ బౌలర్‌గా తనపేరును సార్థకం చేసుకున్నాడు. హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్ ఆల్‌రౌండ్ మెరుపులతో టీమిండియా ఆధిపత్యానికి ఎదురులేక పోయింది. జట్టులోని ఆటగాళ్లంతా కలిసికట్టుగా కదంతొక్కి ప్రపంచకప్ సంగ్రామంలో భారత్ మరోమారు విశ్వవిజేతగా ఆవిర్భవించడంలో విశేషంగా దోహదపడ్డారు. సమర్ధ నాయకుడిగా ముందుండి నడిపించిన సూర్యకుమార్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఈ విజయంతో భారత్‌కు ఐసీసీ ట్రోఫీలు అందించిన దిగ్గజాలు కపిల్ దేవ్, ఎంఎస్ ధోనీ, రోహిత్ శర్మ సరసన నిలిచాడు. ప్రపంచ క్రికెట్‌లో ఆధిపత్యాన్ని చాటుకుంటున్న భారత జట్టు సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. కపిల్ డెవిల్స్, ధోనీ సేన, రోహిత్ బృందం అద్భుత విజయాలను మరిపిస్తూ.. మరో విశ్వకప్పును ఒడిసి పట్టుకుంది. న్యూజిలాండ్‌ను ఏకపక్షంగా నిలువరించిన సూర్యకుమార్ సేన యావద్భారతావని గర్వించే ప్రదర్శన కనబరచింది. రెండేళ్ల క్రితం జరిగిన టోర్నీలో టైటిల్ గెలిచిన భారత జట్టు ఈసారి ట్రోఫీ నిలబెట్టుకొని సరికొత్త చరిత్ర సృష్టించింది. మొత్తంగా మూడోసారి ఈ కప్పును దక్కించుకొని మరే జట్టుకూ సాధ్యమవని అరుదైన ఘనతను అందుకొంది. ఈ అద్భుతానికి సాక్షిగా నిలిచిన అహ్మదాబాద్ స్టేడియంలో మూడేళ్లక్రితం వన్డే ప్రపంచకప్ ఫైల్లో ఎదురైన పరాజయ భారాన్ని దించేసుకుంది. ఆతిథ్య జట్టుకు కప్పు దక్కదన్న సెంటిమెంట్‌ను పటాపంచలు చేసింది. ఇలా ఎన్నో రికార్డులపరంపరలు, మధురస్మృతులను క్రికెట్ అభిమానులకు అందించిన భారత జట్టు విజయం చిరస్మరణీయం. అహ్మదాబాద్ స్టేడియంలో పరుగులను రాబట్టడం కష్టమే అయినా, 255 పరుగుఉల కొట్టి, పటిష్టమైన న్యూజిలాండ్ జట్టును ధీకొటటిన తీరు యువ క్రికెటర్లకు స్ఫూర్తాదాయకం. క్రికెట్ అభిమానలకు విమెన్స్ డే ఆదివారం పండ గనింపింది. రెండేళ్ల క్రితం టీ20 ప్రపంచకప్ గెలిచిన టీమిండియాలోని రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజాలాంటి కీలక ఆటగాళ్లు ఇప్పుడు జట్టులో లేరు. అయినా, ఆ సీనియర్లు లేరన్న లోటు లేకుండా యువ క్రికెటర్లు అద్భుతంగా రాణించారు. ఇదే టీమిండియా బలం అని నిరూపించారు. కొత్త రక్తం వస్తూనే ఉంటుందని నిఊపించారు. టీమిండియా ఈసారి టోర్నీ ఆసాంతం అద్భుమైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. టోర్నమెంట్ మొత్తంగా సూపర్-8 దశలో దక్షిణాఫ్రికాతో పరాజయం మినహా అన్ని మ్యాచుల్లోనూ విజయదుందుభి మోగించి సత్తా చాటుకుంది. మూడుసార్లు 250కి పైగా స్కోర్లు నమోదు చేయడం మన జట్టు యువ బ్యాటర్ల సత్తాకు నిదర్శనం. ఛేదన అయినా, లక్ష్యాన్ని నిర్దేశించడంలో అయినా జట్టు రాటుదేలిందనే చెప్పాలి. ఇలాగే కొనసాగితే రేపు జరిగే అనేక పోటీల్లో విజయం మనదే అవుతుంది. ఈ చిరస్మరణీయ గెలుపులో ఆటగాళ్ల పట్టుదల, ప్రతిభకు తోడు కోచ్ గౌతమ్ గంభీర్ పాత్ర ఎనలేనిది.

# రెస్టారెంట్లపై ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల ప్రభావం..

### చమురు సరఫరాపై భయం అవసరం లేదన్న కేంద్రం

**న్యూఢిల్లీ మార్చి 10 డ్రీమ్ టైమ్స్**

చమురు సరఫరాపై దేశ ప్రజల్లో ఆందోళన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. దేశీయ అవసరాలకు తగ్గట్లుగా చమురును 40 దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు ప్రభుత్వం తెలిపింది. గతంలో 27 దేశాల నుంచే చమురును కొనుగోలు చేయగా.. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో 40 దేశాల నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్నట్లు కేంద్రం వెల్లడించింది.ఈ అంశంపై ఇప్పటికే చమురు సరఫరా దేశాలతో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి సంప్రదింపులు జరిపినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వీలైనంత త్వరగా చమరు సరఫరా చేయాలని కోరినట్లు సమాచారం. కొన్ని దేశాలు ఇప్పటికే సరఫరా మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. దేశంలో ఎల్పీజీ ఉత్పత్తి కూడా 10 శాతం పెరిగిందని




కూడా కేంద్ర వర్గాలు అంటున్నాయి. కేంద్ర ప్రకటనలు సానుకూలంగానే ఉన్నా.. దేశ ప్రజల్లో మాత్రం ఇంకా చమురు సరఫరా విషయంలో అనుమానాలు తగ్గడం లేదు. ఎందుకంటే ఇప్పటికే కమర్షియల్ గ్యాస్ సరఫరా విషయంలో పలు ఆంక్షలు అమలవుతున్నాయి. ముఖ్యంగా ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి నగరాల్లో కమర్షియల్ గ్యాస్ లభ్యత తగ్గిపోవడతో రెస్టారెంట్లు ఇబ్బంది పడుతున్నాయి. ఈ నేపథ్యంలో అవసరమైతే రెస్టారెంట్లను మూయక తప్పదని రెస్టారెంట్స్ అండ్ హోటల్స్ అసోసియేషన్లు అంటున్నాయి. తగినంతగా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరా లేకపోతే రెస్టారెంట్లకు సంబంధించి రోజుకు రూ.1,200 కోట్ల నుంచి రూ.1,300 కోట్ల వరకు నష్టం జరిగే అవకాశం ఉందని నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఏఐ) వైస్ ప్రెసిడెంట్ జోరావర్ కర్లా అన్నారు. ప్రస్తుతం రెస్టారెంట్లకు తగినంతగా ఎల్పీజీ సిలిండర్ల సరఫరా లేదని, 75 శాతం వరకు రెస్టారెంట్లు వీటిపైనే ఆధారపడ్డాయని ఆయన అన్నారు. మరోవైపు ఎల్పీజీ సిలిండర్ల కొరత నేపథ్యంలో ఢిల్లీలో పలు రెస్టారెంట్లు మెనూలో మార్పులు చేశాయి. గ్యాస్ ఎక్కువగా అవసరమైన ఆహార పదార్థాల్ని జాబితా నుంచి తొలగిస్తున్నాయి. ఎల్పీజీ సిలిండర్లపైన కాకుండా.. ఎలక్ట్రిక్ కుక్కర్లపై వంటలు చేయడం ప్రారంభించాయి.

# సమతుల్యత అవసరం

-నకిలీ సమాచారం, భావ వ్యక్తీకరణపై సుప్రీం
-ఐటి నిబంధనల సవరణను సమర్థించుకున్న కేంద్రం
-నకిలీ సమాచారమని నిర్ణయించేదెవరన్న ఎడిటర్స్ గిల్డ్

**న్యూఢిల్లీ మార్చి 10 డ్రీమ్ టైమ్స్**

నకిలీ ఆన్‌లైన్ సమాచారం నుండి దేశాన్ని రక్షించుకోవడానికి, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను పరిరక్షించడానికి మధ్య సమతుల్యతను పాటించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తాము తీసుకువచ్చిన సమాచార సాంకేతికత (ఐటి) నిబంధనలను కేంద్రం సమర్థించుకుంది. సమాచార సాంకేతిక చట్టం లేదా నిబంధనల కింద హాస్యాన్ని, వ్యంగ్యాన్ని, భావ ప్రకటనను, విమర్శనాత్మమైన భావ వ్యక్తీకరణను అణచివేయాలనే ఉద్దేశం లేదని కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు వివరణ ఇచ్చుకున్నారు. 2023 ఏప్రిల్‌లో సవరించిన మేరకు ఐటి (మధ్యవర్తిత్వ మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నైతిక నిబంధనావళి) నిబంధనలు ద్వారా 2024 మార్చిలో జారీ చేసిన నోటిఫికేషన్‌తో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) కింద ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్ (ఎఫ్‌సియు)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కేంద్ర ప్రభుత్వ కార్యకలాపాల గురించి బూటకపు వార్తలు లేదా తప్పుడు సమాచారం సృష్టించడానికి లేదా వ్యాప్తి చేయడానికి ఒక 'అడ్డుకట్ట'గా ఈ ఎఫ్‌సియు పనిచేయాల్సి వుంది. ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా, స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా దాఖలు చేసిన పిటిషన్లతో బాంబే హైకోర్టు ఈ సవరించిన నిబంధనలు, ఎఫ్‌సియు ఏర్పాటులపై న్యాయ పరిశీలన చేపట్టింది. ఆ మేరకు ఎఫ్‌సియు నోటిఫికేషన్‌ను హైకోర్టు 2024 సెప్టెంబరులో కొట్టివేసింది. 2023లో సవరించిన ఐటి నిబంధనలు కూడా రాజ్యాంగ విరుద్ధమని



నిర్ధారించింది. రాజ్యాంగంలోని 14వ అధికరణ (సమానత్వ చట్టం), 19వ అధికరణ (భావ ప్రకటనా స్వేచ్ఛ), 19 (1)(జి) (స్వేచ్ఛ, వృత్తి హక్కు)లను ఈ నిబంధనలు ఉల్లంఘి స్తున్నాయని పేర్కొంది. నిబంధనల్లో భావ ప్రకటన 'బూటకం, తప్పు, తప్పుదారి పట్టించేది" అని పేర్కొనడం చాలా అస్పష్టంగా వుందని, వాటికి ఎలాంటి నిర్వచనం లేనందున అవన్నీ తప్పని నిర్ధారించింది. 'సత్యానికి ఏకైక న్యాయనిర్ణేత'గా ప్రభుత్వం ఆ పాత్రను పోషించలేదని హైకోర్టు పేర్కొంది. బాంబే హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ కేంద్రం సుప్రీంను ఆశ్రయించింది. భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేయాలనే క్రూరమైన ఆలోచనేదీ తమకు లేదని పేర్కొంది.

**బూటకమని ఎవరు నిర్ణయిస్తారు?**

ప్రత్యేకంగా ఈ సమాచారం బూటకం లేదా నకిలీదని ఎఫ్‌సియులో ఎవరు నిర్ణయిస్తారని ఎడిటర్స్ గిల్డ్, అసోసియేషన్ ఆఫ్ ఇండియా మ్యాగజైన్స్, న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ ఆఫ్ డిజిటల్ అసోసియేషన్‌ల తరపు న్యాయవాదులు అరవింద్ దత్తార్, ఎన్.హెచ్.సీర్వారు ప్రశ్నించారు. "అసలు ఎఫ్‌సియును నిర్వహించేది ఎవరు? కేవలం ఒక నోటిఫికేషన్ ద్వారా అటువంటి యూనిట్‌ను ఎలా ఏర్పాటు చేస్తారు?" అని వారు ప్రశ్నించారు. సక్రమంగా నిబంధనలను రూపొందిం చాలని మాత్రమే హైకోర్టు ప్రభుత్వాన్ని కోరిందని చెప్పారు. దానిపై చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ, 'ఈ కేసులో లేవనెత్తిన అంశం చాలా ప్రాధాన్యతను కలిగివుంది. ఇందుకు చట్టాన్ని రూపొందించడం మంచిది. హైకోర్టు లేవదీసిన అంశాలతో, వ్యక్తిగత రాజ్యాంగబద్ధమైన హక్కులను దెబ్బతీయకుండా హక్కులను సమతుల్యం చేయడమెలాగ అనే ప్రశ్న తలెత్తింది. అయితే ఆన్‌లైన్ వేదికల్లో కొన్ని చాలా దారుణంగా దాడులు చేస్తున్నాయని' చీఫ్ జస్టిస్ వ్యాఖ్యా నించారు. "వ్యక్తిగత జీవితాన్ని లేదా దేశాన్ని దేన్నైనా మీరు దెబ్బతీయగలుగుతారు." అని ఆ వేదికలను ఉద్దేశించి అన్నారు. అలా తప్పుదారి పట్టించే లేదా బూటకమైన వాటిని తొలగించాలని దత్తార్ అన్నారు. ఆ 'తప్పుదారి పట్టించే' అన్నదాన్ని ఎవరు నిర్వచించాలని ఆయన న్యాయస్థానాన్ని ప్రశ్నించారు. దీనిపై స్పష్టమైన మార్గదర్శకాలు వుండాలని చీఫ్ జస్టిస్ స్పందించారు."అయితే, అదే సమయంలో ఈ తప్పుడు సమాచారాన్ని సృష్టించే వారిపై ఎలాంటి బాధ్యతలు పెట్టకుండా మొత్తం భారమంతా ప్రభుత్వ యంత్రాంగంపై మోపడమనేది బాగా పరిశీలించాల్సిన అవసరం వుంది." అని అన్నారు. మధ్యలో మెహతా జోక్యం చేసుకుంటూ 'దాన్ని చూడగానే అది నకిలీదని మనకు తెలిసిపోతుంది.' అని అన్నారు. సోషల్ మీడియా మధ్యవర్తులకు ఇప్పటికే చాలా తీవ్రమైన బాధ్యతలు వున్నాయని దత్తార్ పేర్కొన్నారు.


కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై నోటీసులు జారీ చేస్తూ, బాంబే హైకోర్టు నిర్ణయంపై స్టే ఇవ్వాలన్న మెహతా అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. తాత్కాలిక ఉపశమనాలపై దృష్టి పెట్టకుండా కేసును నేరుగా విచారించడానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు బెంచ్ పేర్కొంది.

# ఇండియా- అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలి

### పంజాబ్ మహా పంచాయత్‌లో వక్తల డిమాండ్

**న్యూఢిల్లీ మార్చి 10 డ్రీమ్ టైమ్స్**

: రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజల ప్రయోజనాలను దారుణంగా దెబ్బతీసే భారతదేశం -- అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని రైతు నేతలు డిమాండ్ చేశారు. పంజాబ్‌లోని బర్నాలాలో సోమవారం నిర్వహించిన మహా పంచాయత్‌లో వారు ప్రసంగించారు. భారతదేశం -- అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని, విద్యుత్ బిల్లు, విత్తన బిల్లు, నాలుగు కార్మిక కోడ్‌లు, విబి గ్రామ్ జి చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీ ఇవ్వాలని వక్తలు డిమాండ్ చేశారు. ఈ నెల 19న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న కిసాన్ మహా పంచాయత్ విజయవంతానికి దేశవ్యాప్తంగా



రైతులను సమీకరిస్తున్నట్లు చెప్పారు. ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సుల ఆధారంగా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇండియా -- అమెరికా వాణిజ్య ఒప్పందం వ్యవసాయం, గ్రామీణ జీవనోపాధిపై చూపే హానికర ప్రభావం గురించి రైతులు అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఈ ఒప్పందం పర్యవసానాలను రైతులందరికీ తెలియజేసి, ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మహా పంచాయత్‌లో రైతు నేతలు బల్బీర్ సింగ్ రాజేవాలా, జోగేంద్ర సింగ్ ఉగ్రహాన్, హరింద్ర సింగ్ లక్కోవాలా, బుటా సింగ్, దల్లెవాల్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పాటియాలా జిల్లా సామానాలో రైతులు నిర్వహించిన ఆందోళనలోనూ నేతలు పాల్గొన్నారు.

**దేశవ్యాప్తంగా మహా పంచాయత్‌లు ప్రారంభం**

కేంద్ర ప్రభుత్వ రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) దేశవ్యాప్తంగా మహా పంచాయత్‌లను ప్రారంభించింది. మార్చి 10 నుంచి ఏప్రిల్ 13 వరకు జలియన్ వాలా బాగ్ దినోత్సవం వరకు దేశవ్యాప్తంగా మహా పంచాయత్‌లను నిర్వహించాలని ఎస్‌కెఎం జాతీయ కౌన్సిల్ సమావేశం నిర్ణయించింది. అందులోభాగంగా పంజాబ్‌లోని బర్నాలాలో మహా పంచాయత్ సోమవారం నిర్వహించారు.

# గడువు ఇవ్వాలంటూ మొరపెట్టుకున్న రైతులు.



**శిరివెళ్ళ. మార్చి 10 డ్రీమ్స్ టైమ్స్**
మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో గల ఎస్ ఎస్ పి రాజకుమార్ ఫార్మర్ వేర్ హౌస్ గోడౌన్ ను తహసిల్దార్ ఐ.విజయశ్రీ బ్యాంకు సిబ్బంది మంగళవారం సందర్శించారు. సుమారు నెల రోజుల క్రితం యాల్లూరు కెనరా బ్యాంక్ మేనేజర్ సీజ్ చేయగా గోదాములో ఉన్న దాన్యం గల రైతులు ధాన్యం ఎక్కడ దెబ్బతింటుందోనని ఆందోళన చెందుతూ నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ ను కలిసి తమ ఆవేదనను వ్యక్తం చేయడం పట్ల స్థానిక శిరివెళ్ల తహసిల్దార్ వేర్ హౌస్ గోదామును పరిశీలించి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జెసి ఆదేశించడంతో తహసిల్దార్ ఐ.విజయశ్రీ మంగళవారం శిరివెళ్ల మండలం కోటపాడు గ్రామంలోని వేర్ హౌస్ గోదామును బ్యాంక్ అధికారులు సిబ్బంది సమక్షంలో గోదాము శెట్టర్లు ఓపెన్ చేయించారు. అందులో ఉన్న దాన్యం గల రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఇప్పటికిప్పుడు దాన్యం ఖాళీ చేయమని ఆదేశిస్తే రైతులు తీవ్రంగా నష్టపోతామని డిసెంబర్ వరకు గడువు ఇస్తే మద్దతు ధర లభిస్తుందని తహసిల్దార్ కు రైతులు లిఖితపూర్వకంగా తెలియజేశారు. క్రమం తప్పకుండా ధాన్యం పురుగు తుప్పు పట్టకుండా తగిన సస్యరక్షణ పద్ధతులు పాటిస్తూ ప్రతిరోజు వెంటిలేషన్ తగిలే విధంగా తెరిచి ఉంచాలని గడువు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా రైతుల అభిప్రాయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకు వెళతానని రైతులకు తహసిల్దార్ సూచించారు.

## కొత్తకోడూరులో సిమెంట్ రోడ్లు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సాయివికాస్ రెడ్డి.



**రైల్వే కోడూరు, మార్చి 10 డ్రీమ్స్ టైమ్స్**
రైల్వే కోడూరు పట్టణంలోని కొత్త కోడూరు మరియు కామిశెట్టి నగర్ ప్రాంతాల్లో చేపట్టిన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను మంగళవారం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్డ కడప డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ చైర్మన్ ముక్కారూపానంద రెడ్డి కుమారులు ముక్కా విశాల్ రెడ్డి, ముక్క సాయివికాస్ రెడ్డి కలసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించాలని లక్ష్యంతో ఈ పనులు చేపట్టినట్టు వారు తెలిపారు. పనులు నాణ్యత తో తొందరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా పనులు తొందరగా నిర్వహించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. రైల్వే కోడూరు నియోజకవర్గం లోని ఎస్ టి గ్రామాలలో మౌలిక సదుపాయాలు అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సమస్య వంటి ప్రత్యేక అవసరాలను దశలవారీగా పరిశీలించి పూర్తి చేస్తామని తెలిపారు. రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనిప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడమే ధ్యేయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే కోడూరు టౌన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పోకల మణి, ఉత్తరాది శివ కుమార్, కొప్పరపు అరవింద్, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రైల్వే కోడూరులో ఇఫ్తార్ విందుకు హాజరైన ముక్కా సాయి వికాస్ రెడ్డి.



**రైల్వే కోడూరు మార్చి 10 డ్రీమ్స్ టైమ**
:రైల్వే కోడూరు పట్టణంలోని నూరని మసీదు వద్ద మంగళవారంనిర్వహించిన రంజాన్ మాసం ప్రత్యేక ఇఫ్తార్ విందుకు రైల్వే కోడూరు నియోజకవర్గం టీడీపీ పార్టీ ఇంచార్జ్ మరియు ఖఖణూ చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి కుమారుడు ముక్కా సాయి వికాస్ రెడ్డి హాజరయ్యారు. రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులు, అబ్దుల్ రహమాన్ గారి ఆహ్వానం మేరకు విచ్చేసి వారికి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని రంజాన్ పర్వదినం యొక్క ప్రాముఖ్యతను ప్రస్తావించారు. సమాజంలో సౌహార్దం, సోదరభావం పెంపొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోకల మణి మౌలా పఠాన్ , చీణూ కూటమి నాయకులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# ఉపాలయాలలోని.! పరివారదేవతలకు విశేషపూజలు..!!

**శ్రీశైలం .మార్చి 10 డ్రీమ్స్ టైమ్స్**
శ్రీశైలక్షేత్రంలో మంగళవారం ను పురస్కరించుకుని క్షేత్రంలోని ఉపాలయాలలోని పరివారదేవతలకు దేవస్థానం నిర్వహిస్తున్న సేవలతో భాగంగా లోకాకల్యాణార్ధం సుబ్రహ్మణ్యస్వామికి, బయలు వీరభద్రస్వామికి, నందీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిపించామని కార్యనిర్వాహణాధికారి యం. శ్రీనివాసరావు తెలిపారు. ఆయా పూజలలో ఆలయ అర్చకులు, వేదపండితులు సాంప్రదాయబద్ధంగా లోకాసుభిక్షం కోసం శాస్త్రోక్తంగా మహాసంకల్పాన్ని పఠించి నిర్విఘ్నంగా పూజలు జరిగేందుకు మహాగణపతి పూజలు నిర్వహించి సుబ్రహ్మణ్యస్వామికి అర్చకస్వాములు వేదమంత్రోచ్ఛారణలతో



పంచామృతాభిషేకం, తదుపరి ఫలోదకం,పాలు,పెరుగు, నెయ్యి,తేనె, కొబ్బరినీళ్లు వంటి ద్రవ్యాలతో అభిషేకం జరిపారు.

అనంతరం అర్చనలు,హారతి పూజలు చేశారు. అదేవిధంగా క్షేత్రానికి కాపలకాస్తున్న బయలు వీరభద్రస్వామికి పంచామృతాభిషేకం, ఫలోదక, బిల్వోదక, భస్మోదక, గంధోదక, పుష్పోదకాలతో, మల్లికాగుండంలోని శుద్ధజలాలతో శాస్త్రోక్తంగా అభిషేకించారు. తదుపరి ప్రత్యేక హారతులు సమర్పించారు. మంగళవారం సాయంత్రం ఆలయప్రాంగణంలో కొలువైవున్న నందీశ్వరస్వామికి ఆగమశాస్త్రానుసారంగా ప్రదోషకాల పూజలు నిర్వహించి యధావిధిగా పంచామృతాభిషేకం, అన్నాభిషేకం, పురుషసుక్తం,వృషభసూక్తం వంటి పూజలు జరిపి నానబెట్టిన శనగలను నైవేద్యంగా సమర్పించారు.

## డ్రగ్స్ వ్యతిరేక దినాన్ని విజయవంతం చేయండి



**ఆళ్లగడ్డ మార్చి 10 డ్రీమ్స్ టైమ్స్**
భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గారి స్ఫూర్తితో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు గౌరవనీయులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి మార్గదర్శకత్వంలో vibrants of kalam ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మార్చి 12వ తేదీన డ్రగ్స్ కు వ్యతిరేక ఉద్యమంగా దండి మార్చ్ 2.0 కార్యక్రమం సందర్భంగా ఆళ్లగడ్డ టౌన్ లో అపుస్మా ఆళ్లగడ్డ నియోజకవర్గం యూనిట్ ఆధ్వర్యంలో అపుస్మా ఆళ్లగడ్డ నియోజకవర్గం యూనిట్ అధ్యక్షులు, దండి మార్చ్ 2.0 ఆళ్లగడ్డ నియోజకవర్గం కోఆర్డినేట్ టి అమీర్ బాషా ఆధ్వర్యంలో 100 మీటర్ల జాతీయ జెండాతో విద్యార్థులు ర్యాలీ ప్రతిజ్ఞ ఉంటుంది నేడు ఆళ్లగడ్డ టౌన్ లోని విశ్వశాంతి హై స్కూల్లో దండి మార్చ్ 2.0 పోస్టర్ను గౌరవ అధ్యక్షులు శ్రీ శ్రీనాథ్ రెడ్డి, అధ్యక్షులు టి అమీర్ బాషా, కోశాధికారి వైఎన్ చంద్రశేఖర్ ప్రారంభం చేశారు ఈ సందర్భంగా అమీర్ భాష మాట్లాడుతూ ఆళ్లగడ్డ టౌన్ లో 12వ తేదీ ఉదయం 9 గంటల 45 నిమిషాలకు పాత బస్టాండ్ నుండి 1500 మంది విద్యార్థులతో జాతీయ జెండాలతో ర్యాలీ ప్రారంభమై నాలుగు రోడ్ల కూడిలి వరకు సాగి మానవహారంగా ఏర్పడి డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ కార్యక్రమంతో ముగిస్తుంది అన్నారు ఈ కార్యక్రమానికి విజయవంతం చేయుటకు అందరి సహాయ సహకారాలు కావాలని కోరారు

## ఉద్యాన రైతులను సబ్సిడీలతో ఆదుకోవాలి

-వైఎస్ఆర్సిపి రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి:
-మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి



**ప్యాపిలి మార్చి 10 డ్రీమ్స్ టైమ్స్**
పట్టణంలోని ఉద్యాన పంటలను వైఎస్ఆర్సిపి రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి మెట్టు వెంకటేశ్వర రెడ్డి స్థానిక నాయకులు మాజీ సింగల్ విండో అధ్యక్షులు బోరెడ్డి రామచంద్రారెడ్డి, బొర్రా మల్లికార్జున రెడ్డి, వెంకట్రాం రెడ్డి తో కలసి పట్టణంలోని నర్సరీలలోని ఉద్యాన పంటలను పరిశీలించారు. ఉద్యాన పంటల రైతుల సమస్యలని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యాన పంటల రైతులకు అధిక మొత్తంలో సబ్సిడీలను ఇచ్చి ఆర్థికంగా నిడదొక్కుకునేందుకు కృషి చేయాలన్నారు అలాగే రైతులు ఉద్యాన పంటలపై దృష్టి సారించాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుకు గిట్టుబాటు ధరను కల్పిస్తూ వారికి కావలసిన వ్యవసాయ వనరులను ప్రభుత్వాలు సమకూర్చి రైతుల ఆర్థిక ఎదుగుదలకు కృషి చేయాలని పేర్కొన్నారు.

# పెంచిన గ్యాస్ ధరలు ఉపసంహరించుకోవాలి....

**కోడుమూరు మార్చి 10 డ్రీమ్స్ టైమ్స్**
ఏపీ మహిళా సమాఖ్య NFIW డిమాండ్ స్థానిక కోడుమూరు పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్ గారికి ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఏపీ మహిళా సమాఖ్య జిల్లా నాయకులు సులోచనమ్మ సిపిఐ మండల కార్యదర్శి బి రాజు మాట్లాడుతూఅంతర్జాతీయ సమస్యలను ఎదుర్కోలేక ప్రజలపై భారాలు వేయడం బిజెపి దివాలా కోరు తనానికి నిదర్శనం వారు విమర్శించారు కేంద్రం పెంచిన నిత్యవసర సరుకులు గ్యాస్ ధరలు రాష్ట్ర ప్రభుత్వమే



భరించాలని కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి రాష్ట్ర ప్రజలపై భారాలు మోపుతూ ప్రజలకు ఇబ్బందులు పెడుతూ గురు చేస్తున్న కేంద్ర ప్రభుత్వము తక్షణమే పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను ఉపసంహరించుకోవాలని వారి డిమాండ్ చేశారు లేనియెడల సిపిఐ పార్టీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సుగుణమ్మ లక్ష్మీదేవి కాసింబి సుగుణ మద్దమ్మా లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు

## రథోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదానం

**కోడుమూరు మార్చి 10 డ్రీమ్స్ టైమ్స్**
కోడుమూరు మండలం గోరంట్ల గ్రామంలో వెలసిన శ్రీ గోరంట్ల మాధవ స్వామి రథోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేశిక చార్యులు, వెంకటలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది గోరంట్ల రథోత్సవం సందర్భంగా భక్తులకు



అన్నదానం నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు. రథోత్సవానికి విచ్చేసిన భక్తులకు భోజన ఏర్పాట్లు చేసి సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎమ్ నరసింహ చార్యులు, ఏఎమ్ సునీల్ కుమార్, మనుమలు, మనుమరాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలి

-న్యాయశాఖ మరియు మైనారిటీ వెల్ఫేర్ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్
-అన్ని వర్గాల వారిని అభివృద్ధిలోకి తీసుకొని వస్తున్నాం...
-పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్







**కర్నూలు , మార్చి 10 డ్రీమ్స్ టైమ్స్**
వృత్తి నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని,వక్ఫ్ ఆస్తులను సద్వినియోగం చేసుకోవాలని, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా లబ్ధి పొందాలని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ అన్నారు. మంగళవారం కర్నూలులో ఉస్మానియా కాలేజీ దగ్గర టీ జి వెంకటేష్ షాది ఖానా హాల్లో జరిగిన కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం సందర్భంగా న్యాయశాఖ మరియు మైనారిటీ వెల్ఫేర్ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ మాట్లాడుతూ... వక్ఫ్ బోర్డ్ దగ్గర ఖరీదైన భూములు ఉన్నాయని పట్టింపులకు తగాదాలకు పోకుండా వాటిని సద్వినియోగం చేసుకొని ముస్లిం మైనారిటీలు లబ్ధి పొందాలని కోరారు. గతంలో కర్నూలు జిల్లాకు నేను మంత్రి గా ఉన్నప్పుడు కేఈ కృష్ణమూర్తి కూడా మంత్రిగా ఉన్నారు అయ్యపు రెడ్డి పార్లమెంటు సభ్యులుగా ఉన్నారు. ఆ సమయంలో ఈద్ గా కు 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాము , హాజీరా ఉమెన్స్ కాలేజ్ ను ఏర్పాటు చేశాం , ఆంధ్ర ప్రదేశ్ లో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేశాం , హైదరాబాద్ లో ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం , మఖాన్ - దుకాణ్ స్కీమ్ తీసుకుని వచ్చాం, కర్నూలుకు ఉర్దూ అకాడమీ ని తీసుకుని వచ్చాం , ముత్తవల్లిలకు , మౌజర్లకు గౌరవ వేతనం ఇస్తున్నామని , గతం లో కార్పొరేషన్ ద్వారా లక్షల్లో లోన్లు ఇప్పించాం గత ఐదు సంవత్సరాలు మాత్రం ఏమీ జరగలేదు అని తెలిపారు. ఇప్పుడు మళ్లీ కార్పొరేషన్ ద్వారా లోన్లు ఇప్పించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్కిల్ కాంప్లెక్స్ కట్టాం కంప్యూటర్లు ఏర్పాటు చేశాం డెవలప్మెంట్ కు ప్రోత్సహిస్తున్నాము అని మీకున్న నైపుణ్యాన్ని ఇంకా మెరుగుపరుచుకొని అభివృద్ధిలోకి రావాలని తెలిపారు . ఇపుడు మీకు కార్పొరేషన్ అందిస్తున్న 141 ( ఒకటి రూ6,400/- లు) కుట్టు మిషన్లతో మీ కుటుంబాలను వృద్ధి లోకి తీసుకొని రావాలని , కొత్తగా ఆలోచించి నైపుణ్యం పెంచుకొని మంచి పనులు చేసి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని మహిళలను కోరారు. మీ నైపుణ్యాలను ఇంకా పెంచుకోవాలని మీ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాలని వారిని కోరారు. ఈ సందర్భంగా పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి జి భరత్ మాట్లాడుతూ... జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో వక్ఫ్ కమిటీ ఏర్పాటు చేయకుండా ఉండిపోయారని దానివల్ల ముస్లిం మైనారిటీలకు నష్టం జరిగిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 141 ( ఒకటి రూ6,400/- లు ) ఉషా కంపెనీ బ్రాండెడ్ కుట్టు మిషన్ల పంపిణీ లాంటి అభివృద్ధి పనులు జరుగుతున్నవి అని మంత్రి తెలిపారు. ఈ మిషన్లను సద్వినియోగం చేసుకొని ముస్లిం సోదరీమణులు అభివృద్ధిలోకి రావాలని మంత్రి ఆకాంక్షించారు. కర్నూలులో ఉర్దూ యూనివర్సిటీ పనులు పూర్తి చేయటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని మా సొంత నిధులు కేటాయించి కూడా పనులు చేస్తున్నామని , కర్నూలు ఎగ్జిబిషన్ సొసైటీ మరియు కిడ్స్ వరల్డ్ పార్క్ ద్వారా వచ్చే దాదాపు 50 లక్షల రూపాయల ఆదాయాన్ని ముస్లిం మైనారిటీల కొరకు ఖర్చు చేస్తున్నామని మంత్రి తెలిపారు. స్థానిక బుధవారిపేటలోని దాదాపు 5 ఎకరాల స్థలాన్ని ఎం ఎస్ ఎం ఈ కి కేటాయించినట్లయితే అక్కడ చిన్న చిన్న పరిశ్రమలు నెలకొల్పి మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించగలమని దీనివల్ల వక్స్ బోర్డు కూడా ఆదాయం వస్తుందని , ఈ సమస్యపై సరైన చర్యలు తీసుకోవలసిందిగా మంత్రి ఫరూక్ ను కోరారు. కర్నూలు అసెంబ్లీ పరిధిలో ఏవైనా మసీదు కమిటీలు , షాదీ ఖానా కమిటీలు , కాంప్లెక్స్ కమిటీలు సరిగా పని చేయకపోయినా నిస్తేజంగా ఉన్న వివరాలు తెలిపినట్లైతే వాటిని సరైన దారిలో పెట్టి ముస్లిం మైనారిటీలకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటానని మంత్రి తెలిపారు. మా తండ్రిగారు కట్టించిన ఈ టీజీవి షాదీఖానా ను నాలుగు సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉంచారని మేము అన్ని మతాలను , అన్ని వర్గాలను సమదృష్టితో చూస్తామని , ఆదరిస్తామని , గౌరవిస్తామని అందుకే అందరికీ అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తున్నామని , కావున మమ్మల్ని ఆదరించాలని మాకు అండగా ఉండాలని ఈ సమావేశంలో కోరారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ... కొత్తగా వస్తున్న విద్యా విధానాన్ని , విద్యను ముస్లింలు అభ్యసించాలని అప్పుడే వారి అభివృద్ధి సాధ్యమని , ముస్లింల అభివృద్దే దేశాభివృద్ధి అని తెలిపారు. గత 20 సంవత్సరాల నుండి చాలా అభివృద్ధి జరుగుతూ ఉన్నదని దాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. దాదాపు 3 లక్షల మంది కర్నూలు జిల్లాలో ముస్లింలు ఉన్నారని ప్రతి ఒక్కరూ మంచి విద్యను అభ్యసించి అభివృద్ధిలోకి రావాలని , నర్సింగ్ కోర్సులలో ఉద్యోగ అవకాశాలు చాలా ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సమావేశానికి క్రిస్టియన్ కార్పొరేషన్ ఎం.డి ఏ.శేఖర్ , జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ సబిహా పర్వీన్ , హజ్ కమిటీ మెంబర్ మన్సూర్ అలీ ఖాన్ , మైనారిటీ నాయకులు మహమ్మద్ ఖాన్ , మహబూబ్ ఖాన్ , జియావుల్ హక్ , జుబేర్ , సల్మాన్ , ఇమ్రాన్ , ఇన్చార్జులు వెంకటేష్ ,శుక్రన్ లు పాల్గొన్నారు.

# ఓదేల ప్రాంతానికి ఆర్ఓబీ మంజూరుకై కృషి చేస్తాం

- ఎంపీ వంశీ కృష్ణ



**పెద్దపల్లి, మార్చి 10 డ్రీమ్స్ టైమ్స్**
కొలనూరు ప్రాంతానికి రైల్వే ఓవర్ బ్రిడ్జ్ మంజూరు కావడం ప్రజలకు ఎంతో ఆనందకరమని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీ కృష్ణ తెలిపారు. రైల్వే గేటు కారణంగా కొలనూరు, ఓదేల ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన చెప్పారు. రైల్వే అధికారులు కొలనూరు ప్రాంతాన్ని సందర్శించినప్పుడు తాను స్వయంగా వారితో కలిసి పరిశీలన నిర్వహించానని, ఆ సమయంలో ఓదేల ప్రాంతానికి కూడా ఆర్ఓబీ అత్యవసరమని వివరించానని తెలిపారు.మొదట రైల్వే శాఖ కొలనూరుకు మాత్రమే ఆర్ఓబీ మంజూరు చేసి, ఓదేల ప్రాంతానికి సాధ్యం కాదని తెలిపిందని, అయినప్పటికీ ప్రజల ప్రయోజనాల కోసం నిరంతరం కృషి చేశానని ఎంపీ వంశీ కృష్ణ అన్నారు. పలుమార్లు లేఖలు రాసి, రిప్రెజెంటేషన్లు ఇచ్చిన ఫలితంగా రైల్వే శాఖ స్వంత ఖర్చుతో కొలనూరులో ఆర్ఓబీ నిర్మాణానికి అంగీకరించిందని తెలిపారు. ఓదేల ప్రాంతానికి కూడా ఆర్ఓబీ మంజూరు అయ్యేలా కృషి కొనసాగిస్తామని, రెండు ప్రాంతాల్లో ప్రజల సమస్యలు శాశ్వతంగా పరిష్కారం కావడానికి తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.కొలనూరు గ్రామ ప్రజలకు ఆర్ఓబీ మంజూరు కావడం పట్ల అభినందనలు తెలియజేస్తూ, త్వరలోనే పనులు ప్రారంభమై పూర్తి అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# జూలపల్లి శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో అన్నదాన కార్యక్రమం




**పెద్దపల్లి, మార్చి 10 డ్రీమ్స్ టైమ్స్**
జూలపల్లి మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో అన్నదాన కార్యక్రమాన్ని పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ ప్రారంభించారు. కరీంనగర్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రేగటి సత్యనారాయణ--స్వప్న దంపతులు తమ కుమార్తె ప్రణవి, కుమారుడు ఇషాన్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రఘువీర్ సింగ్ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రార్థించారు. ఆలయ కమిటీ చైర్మన్ పొట్టాల మల్లేశం సత్యనారాయణ, రవీందర్‌లను శాలువాతో సన్మానించారు. అనంతరం రఘువీర్ సింగ్ కూడా ఆలయ కమిటీ సభ్యులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పొట్టాల మల్లేశం, వైస్ ప్రెసిడెంట్ దేవసాని శంకరయ్య, లెక్కల వజ్రారెడ్డి, సభ్యులు పాటకుల అనిల్, వంగపల్లి వెంకటరమణ, బండి రాజిరెడ్డి, మడ్లపెల్లి శ్రీనివాస్, నోముల గోపాల్ రెడ్డి, అందె ప్రసాద్, బెజ్జంకి రమేశ్, ఠాకూర్ సత్యనారాయణ, కొమ్మ సతీష్‌తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# రైతులకు యాంత్రికరణ పనిముట్ల పంపిణీ

-- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



**పెద్దపల్లి, మార్చి 10 డ్రీమ్స్ టైమ్స్**
పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వం, ప్రజాప్రభుత్వంలోనే రైతులకు మేలు జరుగుతుంది అని అన్నారు.పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వ్యవసాయ యాంత్రికరణ పనిముట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా 63 మంది రైతులకు మొత్తం 103 యూనిట్లకు గాను రూ.1 కోటి 11 లక్షల విలువైన రోటోవేటర్లు, గడ్డి కట్టలు కట్టే యంత్రాలను సబ్సిడీతో పంపిణీ చేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిలిపివేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రయోజనార్థం మళ్లీ ప్రారంభించిందని తెలిపారు. రైతులు నానో యూరియా, నానో డిఏపీ, నానో పొటాష్ వాడాలని సూచించారు.అలాగే కేజీ వీల్స్ ట్రాక్టర్ల వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయని, వీటికి పట్టీలు పెట్టుకోవాలని సూచించారు. రోడ్లపై కేజీ వీల్స్‌తో నడిపితే మొదటిసారి రూ.5 వేల జరిమానా, రెండోసారి రూ.10 వేల జరిమానా, మూడోసారి కేసు నమోదు చేసి బండిని సీజ్ చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, డిఏవో శ్రీనివాస్, ఏడిఏ శ్రీనాథ్, మార్కెట్ చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# ఇంటర్ తర్వాత కోర్సులపై అవగాహనకై పోస్టర్ ఆవిష్కరణ



**కరీంనగర్, మార్చి 10 డ్రీమ్స్ టైమ్స్**
తెలంగాణ విద్యా సమితి ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణంలో మార్చి 15వ తేదీ ఆదివారం మెగా ఎడ్యుకేషన్ ఫేర్ ఘనంగా నిర్వహించబడనుంది. ఈ కార్యక్రమం టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో జరగనుంది.ఈ సందర్భంగా తెలంగాణ విద్యా సమితి చైర్మన్ తారక్ గౌడ్, టీమ్ సభ్యులు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులకు ఉన్నత విద్యపై సరైన అవగాహన కల్పించేందుకు ఇలాంటి ఎడ్యుకేషన్ ఫేర్‌లు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ తర్వాత అందుబాటులో ఉన్న వివిధ కోర్సులు, కెరీర్ అవకాశాలపై ఒకే వేదికపై సమగ్ర సమాచారం అందించేందుకు ఈ కార్యక్రమం మంచి అవకాశమని పేర్కొన్నారు.విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ఎడ్యుకేషన్ ఫేర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ విద్యా సమితి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం విజయవంతం కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యా సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి శ్రీనివాస్, టౌన్ అధ్యక్షుడు ప్రవీణ్ రాజ్, గణేష్, రాజేష్, బద్రి తదితరులు పాల్గొన్నారు.

## యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ జనరల్ బాడీ ఎన్నిక



**తిప్పర్తి , మార్చి 10 డ్రీమ్స్ టైమ్స్**
యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సర్వసభ్య సమావేశం తిప్పర్తి మండలం మల్లె పల్లి వారి గూడెం బ్రిటానియా బాప్టిస్ట్ చర్చిలో మంగళవారం జరిగింది. ఈ జనరల్ బాడీ లో ఎలక్షన్స్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చీఫ్ అడ్వైజర్ గా దాసరి ప్రీతి ప్రశాంత్ కుమార్, అధ్యక్షులుగా రెవరెండ్ డాక్టర్ కత్తి డేవిడ్ రాజు, గౌరవ అధ్యక్షులుగా రెవరెండ్ డాక్టర్ ఎం యేసయ్య, జనరల్ సెక్రెటరీగా రెవరెండ్ ఎస్.కె జాన్ బాబు, ఉపాధ్యక్షులుగా రెవరెండ్ ఎన్. గిడియూన్, పి సైమన్, డాక్టర్ పి రాజ్ కుమార్, ట్రెజరర్ గా సిహెచ్ ఏసుదాసు, అసిస్టెంట్ ట్రెజరర్ గా సిహెచ్ జాన్, జాయింట్ సెక్రటరీగా ఆర్ తి మొతి, సెక్రటరీగా వై యేసు రత్నం, అసిస్టెంట్ సెక్రటరీగా పాస్టర్ సామ్యూల్, ఉమెన్స్ కమిటీ అధ్యక్షురాలుగా కె సలోమియా, జనరల్ సెక్రెటరీ జోష్నా పాల్రాజు, చీఫ్ అడ్వైజర్ గా ప్రీతి ప్రశాంత్, ట్రెజరర్ గా కె దేబోరా, ఉపాధ్యక్షులుగా సీమన్, జాయింట్ సెక్రటరీగా కృపాజ్యోతి ఎన్నికయ్యారు. రాబోయే నాలుగు సంవత్సరాలు వరకు ఈ కార్యవర్గం ఉంటుందని తెలిపారు. సుమారు 60 మంది పాస్టర్లు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన కనగల్ మండల నూతన సర్పంచులు



**కనగల్, మార్చి 10 డ్రీమ్స్ టైమ్స్**
నల్లగొండ జిల్లా కనగల్ మండలానికి చెందిన సర్పంచులు మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం ద్వారా ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలతో నేరుగా మమేకమై పనిచేసినప్పుడే వారి అసలు అవసరాలు, సమస్యలు స్పష్టంగా తెలుస్తాయని తెలిపారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి వెంకట్ రెడ్డి గారు దిశానిర్దేశం చేశారు. ప్రజాసేవలో జవాబుదారీతనం ప్రతి ప్రజాప్రతినిధిలో ఉండాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కనగల్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం మనోహర్ రెడ్డి వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# బిజినెస్

## దూసుకెళ్తున్న బంగారం, వెండి..



ఇరాన్- ఇజ్రాయెల్- ఆమెరకా యుద్ధం కారణంగా బంగారం, వెండి ధరల్లో నిత్యం మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మంగళవారం ఉదయం తగ్గుముఖం పట్టిన బంగారం, వెండి ధరలు.. కేవలం నాలుగు గంటల్లోనే ఒక్కసారిగా మళ్లీ పుంజుకున్నాయి. దీంతో కొనుగోలు దారులకు బంగారం, వెండి ధరలు షాక్ ఇచ్చాయి. మంగళవారం ఉదయం హెచ్చుతగ్గుల తర్వాత హైదరాబాద్ సహా దేశ వ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాల్లో పసిడి ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.భారీ హెచ్చుతగ్గుల తర్వాత హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,62,380గా ఉండగా ఉదయం ఈ ధర రూ.1,61,670గా ఉంది. అదే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ప్రస్తుతం రూ.1,48,850 ఉండగా ఉదయం ఈ ధర రూ.1,48,190 వద్ద స్థిరపడింది. అటు ఏపీలోని విజయవాడ, విశాఖ పట్నంలోనూ దాదాపు ఇవే ధరలు కొనసాగుతున్నాయి.ఇక దేశరాజధాని ఢిల్లీలో బంగారం ధరలు చూసుకుంటే 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,62,530గా ఉండగా ఉదయం 6గంటలకు ఈ ధర రూ.1,61,820 వద్ద స్థిరపడింది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధర ప్రస్తుతం రూ.1,49,000 వద్ద కొనసాగుతోంది. అటు చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,64,180 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,50,050 వద్ద కొనసాగుతోంది.ఇక దేశ ఆర్థిక రాజధాని ముంబై, బెంగళూరు, కేరళ, పూణె వంటి నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,62,380 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,48,850 వద్ద కొనసాగుతోంది.ఇక వెండి విషయానికి వస్తే దేశీయ మార్కెట్‌లో ఉదయం 6గంటలకు 2,79,900గా ఉన్న కేజీ వెండి ధర రూ.ఉదయం 10 గంటల సమయానికి రూ.2,90,000 వేలకు చేరుకుంది. అంటే కేవలం 4గంటల్లోనే కేజీ వెండిపై ఏకంగా రూ.10000పైగా పెరిగింది. ఇక హైదరాబాద్ ప్రస్తుతం కేజీ వెండి ధర రూ.3,00,000 వద్ద కొనసాగుతోంది.

## చైనాపై భారత్ కన్ను.. విదేశీ పెట్టుబడుల నిబంధనల్లో మార్పు

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత సరిహద్దును పంచుకునే దేశాలకు సంబంధించి పెట్టుబడుల్ని ఆకర్షించేలా నిబంధనల్లో సవరణలు చేసింది. దీనివల్ల చైనా వంటి సరిహద్దు దేశాల నుంచి పెట్టుబడుల రాక మరింత సులభతరం కానుంది. ఈ కొత్త నిబంధనల ప్రకారం ఇకపై సరిహద్దు దేశాలు ఇండియాలో ఈజీగా ఇన్వెస్ట్ చేయొచ్చు. ఇండియాలో పది శాతం వరకు పెట్టుబడులకు కేంద్ర ప్రభుత్వ అనుమతి అవసరం లేదు. గతంలో ఇండియాలోని కంపెనీలలో ఈ దేశాలు ఒక్క శాతం వాటా దక్కించుకోవాలనుకున్నా కేంద్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సిందే. ఇప్పుడు ఇండియాలోని ఏ కంపెనీలోనైనా సులభంగా 10 శాతం వాటాను సరిహద్దు దేశాలు దక్కించుకోవచ్చు. ఈ నిర్ణయంతో ఇండియా సరిహద్దు దేశాలైన చైనా, నేపాల్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, భూటాన్, మయన్మార్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల నుంచి పెట్టబడులు




రావొచ్చు. ఈ మేరకు మోదీ ఆధ్వర్యంలో సోమవారం సమావేశమైన కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. అయితే, విదేశీ పెట్టుబడులకు సంబంధించి కొన్ని రంగాల్లో ఉన్న ఇతర ఆంక్షలు, నిబంధనలు మాత్రం అలాగే ఉంటాయి. అంతకుముందు సులభతరమైన నిబంధనలే ఉండేవి. కానీ, కోవిడ్ సమయంలో దేశీయ కంపెనీల్ని కాపాడేందుకు కేంద్రం నిబంధనల్ని కఠినతరం చేసింది. విదేశీ కంపెనీలు ఇండియాలో పెట్టుబడులు పెడుతూ, మన కంపెనీల్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించడం, పెత్తనం చెలాయించడం వంటివి చేస్తుండటంతో కేంద్రం నిబంధనల్ని మార్చింది. ముఖ్యంగా 2020లో చైనా, భారత సైనికుల మధ్య చెలరేగిన ఘర్షణ నేపథ్యంలో కేంద్రం చైనా సహా సరిహద్దు దేశాల పెట్టుబడులపై ఆంక్షలు విధించింది.

## సరికొత్తగా హ్యుందాయ్ వెర్నా

### ప్రారంభ ధర రూ.10.98 లక్షలు

**న్యూఢిల్లీ,**
దేశీయ మార్కెట్లోకి సరికొత్త వెర్నాను విడుదల చేసింది హ్యుందాయ్ మోటర్ ఇండియా. ఈ కారు ప్రారంభ ధర రూ.10.98 లక్షలుగా నిర్ణయించింది. పాత మాడల్‌తో పోలిస్తే ఈ నయా మాడల్‌ను మరింత ఆధునీకరించి, ముఖ్యంగా లోపల, బయట భాగంలో సెడాన్‌గా తీర్చిదిద్దినట్టు పేర్కొంది.1.5 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌తో తీర్చిదిద్దిన ఈ మాడల్ మాన్యువల్, ఆటోమేటిక్




మాడల్ లభించనున్నది. 360 డిగ్రీల కెమెరాలు, అడాస్ స్యూట్, ఎనిమిది స్పీకర్లు, బ్లైండ్ స్పాట్ మానిటర్ వంటి టెక్నాలజీతో తయారు చేసింది.

# అర్ష్‌దీప్ సింగ్‌కు ఐసీసీ ఫైన్..!

టీమిండియా పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌కు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) భారీ షాక్ ఇచ్చింది. టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ మ్యాచ్ సందర్భంగా.. ఐసీసీ ప్రవర్తన నియమావళి ఉల్లంఘించినందుకు గానూ అతడికి జరిమానా విధించింది. అతడి మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించింది. అంతేకాదు అతడి అకౌంట్‌లో ఓ డీమెరిట్ పాయింట్‌ను కూడా చేర్చింది.మార్చి 8వ తేదీ, ఆదివారం రోజున అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 11వ ఓవర్‌ను.. భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్ వేశాడు. అప్పుడు క్రీజ్‌లో న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ ఉన్నాడు. ఇక అర్ష్‌దీప్ సింగ్ వేసిన రెండు బంతులను వరుసగా డారిల్ మిచెల్ సిక్సర్లుగా మలిచాడు. దీంతో అర్ష్‌దీప్ తీవ్ర అసహనానికి గురయ్యాడు. ఆ తరువాత వేసిన మూడవ బంతిని మిచెల్ షాట్





ఆడగా.. బాల్‌ను అర్ష్‌దీప్ ఆపాడు. వెంటనే బాల్‌ను వికెట్ల పైకి విసరకుండా మిచెల్ పైకి విసిరాడు. దీనిపై మిచెల్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఏంటి అన్నట్లుగా అర్ష్‌దీప్ సింగ్‌ను ప్రశ్నించాడు. అర్ష్‌దీప్ మాత్రం ఏమీ పట్టించుకోకుండా, కనీసం సారీ చెప్పకుండా తిరిగి తరువాత బంతిని వేసేందుకు వెళ్లిపోయాడు. అయితే.. టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాత్రం డారిల్ మిచెల్ వద్దకు వెళ్లి అతడికి సర్దిచెప్పాడు. అంపైర్ నచ్చజెప్పడంతో ఓవర్ పూర్తి కాగానే మిచెల్‌కు అర్ష్‌దీప్ సింగ్ క్షమాపణ చెప్పాడు. తాను కావాలని బంతిని విసరలేదని, బాల్ స్వింగ్ అయి మిచెల్‌ను తాకిందని, ఇందుకు అతడికి సారీ చెప్పినట్లు మ్యాచ్ అనంతరం అర్ష్‌దీప్ సింగ్ చెప్పాడు. అయితే ఐసీసీ ప్రవర్తన నియమావళి ఉల్లంఘించినందుకు గానూ అర్ష్‌దీప్ సింగ్‌కి జరిమానా విధించింది. అతడి మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించింది. అంతేకాదు అతడి అకౌంట్‌లో ఓ డీమెరిట్ పాయింట్‌ను కూడా చేర్చింది. .....

# స్పోర్ట్స్

## ఇషాన్ కిషన్ కాబోయే భార్య ఈమెనే!

భారత యువ క్రికెటర్ ఇషాన్ కిషన్.. మైదానంలో తన మెరుపు బ్యాటింగ్‌తోనే కాకుండా తన వ్యక్తిగత జీవితంతోనూ వార్తల్లో నిలుస్తున్నాడు. ముఖ్యంగా 2026 టీ20 ప్రపంచకప్‌లో టీమ్ఇండియా ఘనవిజయం సాధించిన తర్వాత ఇషాన్ కిషన్ తన ప్రియురాలు అదితి హుండియాతో కలిసి సంబరాలు చేసుకున్న ఫోటోలు సోషల్ మీడియాలో ఇప్పుడు సెన్సేషన్‌గా మారాయి.భారత యువ క్రికెటర్ ఇషాన్ కిషన్..



మైదానంలో తన మెరుపు బ్యాటింగ్‌తోనే కాకుండా తన వ్యక్తిగత జీవితంతోనూ వార్తల్లో నిలుస్తున్నాడు. ముఖ్యంగా 2026 టీ20 ప్రపంచకప్‌లో టీమ్ఇండియా ఘనవిజయం సాధించిన తర్వాత ఇషాన్ కిషన్ తన ప్రియురాలు అదితి హుండియాతో కలిసి సంబరాలు చేసుకున్న ఫోటోలు సోషల్ మీడియాలో ఇప్పుడు సెన్సేషన్‌గా మారాయి. టీమిండియా ఓపెనర్ ఇషాన్ కిషన్, ప్రముఖ మోడల్ అదితి హుండియా గత కొంతకాలంగా లవ్‌లో ఉన్న విషయం తెలిసిందే. ప్రసుత్తం వీరిద్దరి మధ్య వయసు వ్యత్యాసం గురించి సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది. ఇషాన్ అభిమానులు ఆశ్చర్యపరిచే విషయం ఏమిటంటే.. ఇషాన్ కిషన్ తన ప్రియురాలు అదితి కంటే వయసులో చిన్నవాడు. టీమ్ఇండియా క్రికెటర్ ఇషాన్ కిషన్ 1998లో జన్మించాడు. కానీ, ఆయన ప్రేయసి అదితి హుండియా మాత్రం 1997లో జన్మించింది. వీరిద్దరి మధ్య ఒక సంవత్సరం వయసు వ్యత్యాసం ఉంది. సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ వంటి దిగ్గజ క్రికెటర్ల బాటలోనే ఇషాన్ కూడా తనకంటే వయసులో పెద్దదైన మహిళతో ప్రేమలో పడటం విశేషం. ఎవరీ అదితి హుండియా? రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన అదితి హుండియా ఫ్యాషన్ ప్రపంచంలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె ఒక ప్రముఖ మోడల్, వ్యాపారవేత్త. 2017లో మిస్ ఇండియా ఫైనలిస్ట్‌గా నిలిచిన అదితి, 2018లో 'మిస్ దివా సుప్రానేషనల్' టైటిల్‌ను గెలుచుకున్నారు. అదే విధంగా 2019లో అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు. ఐపీఎల్ మ్యాచ్‌ల నుంచి అంతర్జాతీయ మ్యాచ్‌ల వరకు ఇషాన్‌కు మద్దతుగా ఆమె ఎప్పుడూ స్టేడియంలో కనిపిస్తూనే ఉంటారు. తాజాగా అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన 2026 టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై భారత్ చారిత్రాత్మక విజయం సాధించింది. ఈ కీలక మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ హాఫ్ సెంచరీతో అదరగొట్టారు. భారత్ ట్రోఫీ గెలిచిన తర్వాత, మైదానంలో ఇషాన్ తన కుటుంబ సభ్యులు, అదితితో కలిసి దిగిన ఫోటోలు వైరల్ అయ్యాయి. వీరిద్దరి కెమిస్ట్రీని చూసి అభిమానులు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

# టీమిండియాపై అఫ్రిది ప్రశంసల జల్లు

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో విజేతగా నిలిచిన టీమిండియాపై పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది ప్రశంసల జల్లు కురిపించాడు. ఇది కదా ఛాంపియన్ ఆట అంటే అని కొనియాడాడు. ఈ టోర్నీలో టీమిండియా ప్రయాణం గొప్పగా సాగిందని, ఈ విజయానికి వారు పూర్తి అర్హులని తెలిపాడు. ఆదివారం అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఫైనల్లో సమష్టిగా రాణించిన న్యూజిలాండ్ 96 పరుగుల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. ఈ విజయాన్ని తక్కువ చేస్తూ పాకిస్థాన్ మాజీ ఆటగాళ్లంతా భారత్‌పై తమ అక్కసు వెళ్లగక్కగా... అఫ్రిది మాత్రం ప్రశంసల జల్లు కురిపించాడు. భారత్ విజయాన్ని కొనియాడుతూ ఎక్స్‌వేదికగా అఫ్రిది ఓ వీడియోను ట్వీట్ చేశాడు. 'టీ20 ప్రపంచకప్ ముగిసింది. ఈ టోర్నీలో భారత్ విజేతగా నిలవడానికి పూర్తి అర్హత ఉంది. వారి




కాంబినేషన్ అద్భుతం. తుది జట్టులో ఉన్న ఆటగాళ్లే కాకుండా.. బెంచ్ ఆటగాళ్లు కూడా అంతే బలంగా ఉన్నారు. అందుకే బెంచ్ బలంగా ఉంటే జట్టు విజయం సాధిస్తుందని నేను ఎప్పుడూ చెబుతంటాను. భారత జట్టులోని 15 మందిలో ప్రతీ ఒక్కరు మ్యాచ్ విన్నరే. టీమిండియా ఈ టోర్నీ అంతా ఒక ఛాంపియన్‌లా ఆడింది. సంజూ శాంసన్ ప్రదర్శన అమోఘం. తనకు వచ్చిన అవకాశాలను అద్భుతంగా సద్వినియోగం చేసుకున్నాడు. పరిస్థితులకు తగ్గట్టుగా బ్యాటింగ్ చేస్తూనే.. భారీ హిట్టింగ్‌తో ఇన్నింగ్స్‌ను నిర్మించగల సత్తా అతనికి ఉంది. ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ కూడా అసాధారణ ప్రదర్శన కనబర్చారు.జస్‌ప్రీత్ బుమ్రా భారత బౌలింగ్ విభాగానికి వెన్నెముక. చాలా కాలంగా భారత జట్టును తన భుజాలపై మోస్తున్నాడు. కొత్త బంతి అయినా.. పాత బంతి అయినా.. స్లోయర్, యార్కర్ ఏదైనా సరే.. నా దృష్టిలో బుమ్రానే అత్యుత్తమ బౌలర్' అని అఫ్రిది కొనియాడాడు. ఈ టోర్నీలో సౌతాఫ్రికాతో మాత్రమే ఓడిన టీమిండియా.. మిగిలిన అన్ని మ్యాచ్‌ల్లోనూ తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించి మూడో టీ20 ప్రపంచకప్‌ను ముద్దాడింది..

# నెట్టింట రామాయణం ఫోటోలు

## అవి నకిలీవంటూ చిత్రబృందం కామెంట్




భారీ బడ్జెట్‌తో బాలీవుడ్ నుంచి రాబోతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణం'కు సంబంధించి సోషల్ మీడియాలో ఒక ఫొటో తెగ వైరలవుతున్నాయి. ఈ సినిమా షూటింగ్ సెట్స్ నుంచి రాముడిగా నటిస్తున్న రణబీర్‌తో పాటు సీతగా నటిస్తున్న సాయి పల్లవిల ఫొటోలు లీక్ అయ్యాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది. అయితే ఈ ప్రచారంపై చిత్రబృందం స్పందిస్తూ.. ఆ ఫొటోలు నకిలివని.. అవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో సృష్టించిన ఫేస్-స్వాప్ చిత్రాలని చిత్రబృందం తెలిపింది. 2015లో ప్రసారమైన 'సియా కే రామ్' సీరియల్‌లోని స్టిల్స్‌ను తీసుకుని, అందులోని నటీనటుల ముఖాలకు బదులుగా రణబీర్, సాయి పల్లవి ముఖాలను ఆకతాయిలు ఎడిట్ చేసినట్లు చిత్రబృందం తెలిపింది.నితీష్ తివారీ దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రంలో రణబీర్ కపూర్, సాయి పల్లవితో పాటు రావణుడిగా యశ్, హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్నారు. ఈ భారీ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. ఇందులో మొదటి భాగం 2026 దీపావళికి ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉండగా అధికారిక పోస్టర్లు త్వరలోనే విడుదల కానున్నాయి.




# గోపీచంద్ మూవీలో రీతూవర్మ



హీరో గోపీచంద్ మరో ప్రతిష్టాత్మక చిత్రంతో అలరించేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. సంకల్ప్‌రెడ్డి దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. గోపీచంద్ 33వ చిత్రంగా ఇది ప్రచారంలో ఉంది. భారీ బ్జడెట్‌తో రానున్న ఈ సినిమాలో రీతు వర్మను హీరోయిన్‌గా ఎంపిక చేశారు. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ ఆమె పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో రీతూ 'సత్యవతి' అనే పాత్రలో కనిపించనున్నట్లు తెలిపారు. పోస్టర్‌లో ఆమె లుక్ పవర్‌ఫుల్‌గా, పాత్రకు తగ్గట్టుగా వైవిధ్యంగా కనిపిస్తోంది. 7వ శతాబ్దానికి చెందిన, చరిత్రలో పెద్దగా వెలుగులోకి రాని ఓ యదార్థ సంఘటన నేపథ్యంలో ఈ పీరియడ్ యాక్షన్ డ్రామా తెరకెక్కుతుండటం విశేషం. మరింత సమాచారం, ఇతర నటీనటుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస చిట్టూరి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

# ప్రభాస్ స్పిరిట్ కోసం అభిమానుల ఎదురుచూపు

## యాక్షన్ డ్రామాతో పోటీ లవ సెంటిమెంట్స్




రాజాసాబ్ డిజాస్టర్‌తో ఇప్పుడు ప్రభాస్ అభిమానులు ఆయన తదుపరి సినిమా స్పిరిట్ కోసం తెగ ఎదురుచూస్తున్నారు. ప్రభాస్ నటిస్తున్న భారీ ప్రాజెక్ట్‌లలో ప్రేక్షకులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా స్పిరిట్ అభిమానుల అంచనాలకు తగ్గట్లుగా రూపొందించడంలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్రయత్నిస్తున్నారు. ఈ చిత్రం ఒక పవర్‌ఫుల్ కాప్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ ప్రకటించినప్పటి నుంచే సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ నటి తృప్తి ది్మ్రి నటిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. ప్రస్తుత షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరణ జరుగుతుండగా, అది పూర్తయ్యిన వెంటనే ఒక గ్రాండ్ సాంగ్‌ను షూట్ చేయాలని చిత్రబృందం ఎ÷-లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ పాట సినిమాలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా ఈ సాంగ్‌లో ప్రభాస్ మాస్ స్టెప్స్‌తో పాటు తృప్తి ది్మ్రి గ్లామర్ కూడా హైలైట్‌గా ఉండనుందని చెబుతున్నారు. భారీ సెట్స్, గ్రాండ్ విజువల్స్‌తో ఈ పాటను తెరకెక్కించేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇక 'స్పిరిట్' సినిమా మొత్తంగా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. ఇందులో ప్రభాస్ ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. ముఖ్యంగా ప్రభాస్ లుక్ పూర్తిగా వైల్డ్ అండ్ మాస్ అవతార్‌లో ఉండటంతో అభిమానుల్లో ఈ సినిమాపై హైప్ మరింత పెరిగింది. కథలోని ఎమోషన్, యాక్షన్‌కు తగ్గట్టుగా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా ప్రత్యేకంగా ఉండబోతుందని సమాచారం. భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను టి-సిరీస్‌తో పాటు భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సాంకేతికంగా కూడా ఈ సినిమా అత్యున్నత ప్రమాణాలతో రూపొందించేందుకు మేకర్స్ ప్రత్యేకంగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక కథ విషయానికి వస్తే, 'స్పిరిట్' మెయిన్ కాన్సెప్ట్ పూర్తిగా కొత్తగా ఉండబోతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తన స్టైల్‌కు తగ్గట్టుగా రియలిస్టిక్ యాక్షన్‌తో పాటు గట్టి ఎమోషనల్ ఎలిమెంట్స్ కూడా ఈ సినిమాలో చూపించనున్నారని టాక్ వినిపిస్తోంది.

# సుస్మిత బర్త్‌డే...
# చిరు ఎమోషనల్ పోస్ట్



మెగాస్టార్ చిరంజీవి కేవలం వెండితెరపైనే కాదు, నిజ జీవితంలోనూ ఒక గొప్ప తండ్రిగా తన బాధ్యతలను, ప్రేమని ఎప్పుడూ చాటుకుంటూనే ఉంటారు. తాజాగా తన పెద్ద కుమార్తె, నిర్మాత సుస్మిత కొణిదెల పుట్టినరోజును పురస్కరించుకుని చిరు ఎమోషనల్ నోట్‌ని అభిమానులతో పంచుకున్నాడు. నా వేలు పట్టుకుని నడకలు నేర్చుకున్న ఆ చిన్నారి నుంచి.. ఈరోజు ఎంతో బాధ్యతాయుతమైన, హుందాతనమున్న స్త్రీగా ఎదిగిన నిన్ను చూస్తుంటే గర్వంగా ఉంది. ఒకప్పుడు తన సినిమాలను చూస్తూ మురిసిపోయిన నా కూతురు, ఈరోజు నా సినిమాకే నిర్మాతగా మారి, తనకు ఒక మెమరబుల్ బ్లాక్‌బస్టర్‌ను అందించడం ఒక తండ్రిగా తనకు దక్కిన అత్యంత ప్రత్యేకమైన గౌరవమని చిరు కొనియాడారు. నా ప్రియమైన హనీ పాపా.. నువ్వు చేసే ప్రతి పనిలోనూ విజయం సాధించాలని, ఎప్పుడూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాను. నీ కీర్తి ఇలాగే వెలుగులీనాలి అంటూ మెగాస్టార్ ఎక్స్ వేదికగా రాసుకోచ్చాడు. ఈ పోస్ట్‌కి చిరంజీవి తన కూతురిని చిన్నప్పుడు ఎత్తుకున్న ఫోటోతో పాటు, ప్రస్తుత ఫోటోను కూడా జత చేశాడు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831